**రిపోర్టర్లు కావలెను...**

నిత్య నూతనంగా వెలుగుతూ సంచలన వార్తా కథనాలతో ముందుకు సాగుతున్న నేటి ప్రభాత సూర్య దిన పత్రిక లో పనిచేయుటకు తెలంగాణ లోని అన్ని జిల్లా కేంద్రాలలో, నియోజకవర్గాలలో మండల కేంద్రాలలో అంకిత భావంతో పనిచేసే రిపోర్టర్లు కావలెను ఆసక్తి కలిగిన వారు క్రింది ఉన్న నంబర్ కి సంప్రదించగలరు

సంప్రదించవలసిన వారు

9100900931, 9100900918

గమనిక :వాట్సాప్ లో బయోడేటా పంపగలరు



# నేటి ప్రభాత సూర్య

జాతీయ తెలుగు దిన పత్రిక

TGTEL/25/A0784.


## లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం.. మరో ఇద్దరి అరెస్ట్..!




ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 29 ఎడిటర్ : పోలగోని రాజేష్ పేజీలు : 8, వెల రూ. 4, /- మంగళవారం - 01 - జూలై - 2025


# పాశమైలారం పారిశ్రామిక వాడలో భారీ పేలుడు




పేలుడు దాటికి గాల్లో ఎగిరిన కార్మికులు

ఒక్కసారిగా చెలరేగిన మంటలు.. 13 మంది మృతి

రియాక్టర్ పేలుడు టి వి తోనే ప్రమాదం,,, మృతుల సంఖ్య పెరిగే అవకాశం

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా...సీఎం రేవంత్ రెడ్డి

ఆ కుటుంబాలను ఆదుకోవాలి..కేసీఆర్

ఘటన పట్ల విచారం వ్యక్తంచేసిన రాష్ట్ర గవర్నర్

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య: హైదరాబాద్ శివారు ప్రాంతమైన సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో భారీ పేలుడు సంభవించింది. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన కార్మికుల్ని దగ్గరలోని ఆస్పత్రులకు తరలించారు. ఈ పేలుడుతో మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటల్ని ఆర్పి ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. రియాక్టర్ పేలడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు దాదాపు 100 మీటర్ల వరకు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డారు. ఈ భారీ ప్రమాదంలో ఇప్పటి వరకు 13 మంది చనిపోగా.. మరో 35 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుస్తోంది. మృతుల్లో ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ఎన్. గోవన్ కూడా ఉన్నారని సమాచారం. ప్రమాద స్థలంలో పలువురి కార్మికుల మృతదేహాలు గుర్తు పట్టలేనంత చెల్లాచెదురయ్యాయి. అనంతరం... ఆ ప్రాంతంలో కార్మికుల కుటుంబ సభ్యుల, బంధువుల రోదనలు మిన్నంటాయి. మరోవైపు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుల్లో సుమారు 12 మంది పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన కాసేపటికే సంఘటనా స్థలాన్ని కార్మిక శాఖ మంత్రి వివేక్ తో కలిసి మంత్రి దామోదర రాజనర్సింహ పరిశీలించారు. ఈ సందర్భంగా క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. జరిగిన ఘటన బాధాకరం, దురదృష్టకరమని అన్నారు. మృతుల సంఖ్య పెరగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక ఘటనా స్థలంలో కార్మికుల బంధువుల రోదనలు మిన్నంటాయి. ఫ్యాక్టరీలో పేలుడు తర్వాత మంటలు చెలరేగగా కార్మికులు పరుగులు తీశారు. కొందరు కార్మికులు మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ ఘటన గురించి తెలియగానే కార్మికుల కుటుంబసభ్యులు ప్రమాదం జరిగిన కంపెనీ దగ్గరకు చేరుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆరా తీశారు. పాశ మైలారం, పారిశ్రామిక వాడ, అగ్ని ప్రమాద ఘటనలో పలువురు మరణించడం దిగ్భ్రాంతి కలిగించిందని తెలిపారు. ఇదే సమయంలో క్షతగాత్రులక మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు. ఈ ఘటనపై మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిగాచి పరిశ్రమలోని కార్మికుల మృతిపట్ల సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. చనిపోయిన వారి కుటుంబాలని మిగతా 2లో..




## కాంగ్రెస్ లో కాకా పుట్టిస్తున్న కొండా

తాజా వ్యాఖ్యలతో మరింత దుమారం

ఎన్నికల్లో 70 కోట్లు ఖర్చు చేశా-కొండా మురళీ

నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో,,,అసమ్మతి వర్గం భేటీ

కాంగ్రెస్ ను వదలని ఉమ్మడి వరంగల్ తలనొప్పి

అధిష్టానం నిర్ణయం ఎలా ఉండబోతోంది

(నేటి ప్రభాత సూర్య పొలిటికల్ బ్యూరో): పదిహేనేళ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ రాజకీయాలు చికాకుపెట్టిస్తున్నాయి. కొండా మురళీ వ్యాఖ్యలు ఆ పార్టీలో కాకపుట్టిస్తున్నాయి. ఇదిలావుంటే విచారణకు పార్టీ క్రమశిక్షణా కమిటీ ముందుకు వచ్చిన కొండా మురళీ వివరణ ఇవ్వాల్సిందిపోగా తమ ప్రత్యర్థులపై విమర్శలు చేస్తూ కమిటీకి ఓ లేఖ అందించారు. ఎన్నికల్లో గెలిచేందుకు తాను 70 కోట్లు ఖర్చుచేశానని ఆయన మీడియా ముందు వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో మిగతా 2లో..

## మీ ఇద్దరికి ఉరిలేదా శిలువ

ట్రంప్, నెతన్యాహుకు హెచ్చరిస్తూ..ఇరాన్ మతాధికారి ఫత్వా

యుద్ధ వాతావరణం మళ్లీ రగులుతుందా....?



కొన్ని సార్లు మాటలే యుద్ధాలకు దారి తీస్తాయి. అలాంటి మాటలు యుద్ధం వాతావరణం కాస్త చల్లారుతున్న తరుణంలో వస్తే పరిస్థితి ఎలా ఉంటుంది. ఇపుడు ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో ఇరాన్ లోని అగ్రశేణి మతాధికారి జారీ చేసిన ఫత్వా చర్చకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ముగిసినా దాని ప్రకంపనలు మిగతా 2లో..

## సార్క్ స్థానంలో,,,, చైనా, పాక్, బంగ్లా కొత్త కూటమి



మనదేశానికి వ్యతిరేకంగా శత్రుదేశాలు మరోసారి ఏకమవుతున్నాయి. దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ (సార్క్) కూటమిలో భారత్ పాటు భాగస్వాములుగా ఉన్న చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ క్రమంగా మన దేశానికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో భారత్ కు వ్యతిరేకంగా కొత్త కూటమి ఏర్పాటు చేసే దిశగా అడుగులేస్తున్నాయి. ఇప్పటికే ఉన్న సార్క్ కూటమిలో పాకిస్తాన్ ఉందన్న కారణంతో భారత్ దూరంగా ఉంటున్న నేపథ్యంలో ఈ ప్రత్యామ్నాయ కూటమిని తెరపైకి తెస్తున్నాయి. సార్క్ కూటమిలో కీలక సభ్య దేశంగా ఉన్న భారత్.. మిగతా 2లో..

# పార్టీ విధేయుడికే పట్టం

- తెలంగాణ బీజేపీ రథసారధిగా రాంచందర్‌రావు,,,?
- నేడు అధికారిక ప్రకటన అసమ్మతి గళాలకు కమలం అధినాయకత్వం చెక్
- అందరివాడిగా రాంచందర్‌రావు పేరు తెచ్చుకొంటూరా
- ఎన్నిక తీరుపై రాజాసింగ్ అసమతృప్తి
- పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా



(నేటి ప్రభాత సూర్య-పొలిటికల్ బ్యూరో): తెలంగాణ బీజేపీ కొత్త చీఫ్ ఖరారయ్యారు. ఎవరూ ఊహించని విధంగా రాంచందర్‌రావు ను పార్టీ అధ్యక్షుడిగా ఎంపిక చేసారు. అనేక తర్జన భర్జనల తరువాత పార్టీ నాయకత్వం కొత్త అధ్యక్షుడిని ఖరారు చేసింది. తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎవరో తెలిసిపోయింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్థానంలో ఎన్. రాంచందర్ రావు తెలంగాణలో కమల దళానికి సారథిగా నియమితులు కానున్నారు. తొలి నుంచి పలువురు పేర్లు రేసులోకి వచ్చాయి. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి కోసం రాంచందర్ రావుతోపాటు బీసీ సామాజికవర్గానికి చెందిన ఎంపీలు ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్ పేర్లు బలంగా వినిపించాయి. అయితే చివరకు అధిష్టానం రాంచందర్ రావు వైపు మొగ్గింది. మిగతా 2లో..

## వారి ఫోన్లూ ట్యాప్ చేసుకోవచ్చు

కేంద్రం కొత్త నిబంధనకానీ అనుమతి తప్పనిసరి



ఫోన్ ట్యాపింగ్ ల వ్యవహారం దేశ వ్యాప్తంగానే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ గత కొంతకాలంగా చర్చసాగుతోంది. ఈ తరుణంలో కేంద్రం తీసుకొన్న ఓ నిర్ణయం మరింత చర్చాంశనీయంగా మారింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కేంద్రం కొత్త నిబంధనలను ప్రతిపాదించింది. దీని ప్రకారం ఇతర రాష్ట్రాల్లోని వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసుకోవచ్చు. అయితే అలా ఫోన్లను ట్యాప్ చేయాలంటే కేంద్ర హోం శాఖ అనుమతి తప్పనిసరి. తెలంగాణలో వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో ఈ ప్రతిపాదన ప్రాధాన్యతను సంతరించుకుంది. గతంలో పీసీసీ, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురి ఫోన్‌లు అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలున్నాయి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా మిగతా 2లో..



## బనకచర్ల ప్రాజెక్టు బ్రేక్

ఏపీకి కేంద్రం భారీ షాక్

పర్యావరణ అనుమతుల నిరాకరణ

ఫలించిన రేవంత్ రెడ్డి ప్రయత్నం...?

తాజాగా కేంద్రం తీసుకొన్ననిర్ణయంతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల జల వివాదం మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కేంద్రం నుండి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కీలక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు నిరాకరించినట్లు కేంద్రం స్పష్టం చేసింది. ఏపీ పంపిన ప్రతిపాదనలను తిప్పి పంపింది. దీంతో బనకచర్ల కాలువల సామర్థ్యం పెంపు పనులను చేపట్టాలన్న చంద్రబాబు ప్రభుత్వ ఆశలకు అడ్డుకట్ట పడింది. పర్యావరణ అనుమతులు పొందడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విఫలమైందని కేంద్రం తేల్చి చెప్పింది. ఈ నిర్ణయం వెనుక తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిర్యాదు కూడా ఒక కారణంగా తెలుస్తోంది. బనకచర్ల ప్రాజెక్టును అక్రమంగా చేపట్టిన ప్రాజెక్టుగా పేర్కొంటూ, వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఆ సమయంలో ఏపీ సీఎం చంద్రబాబు సైతం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. సముద్రంలో కలిసే నీళ్లను వినియోగించుకుంటే తప్పు ఏముందని ఆయన రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. దీనిపై కూర్చొని మాట్లాడుకుంటే సమస్యకు పరిష్కారం లభిస్తుందని చంద్రబాబు చెప్పడం జరిగింది. అయితే బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చేది లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని కేంద్రం ఈ తుది నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బనకచర్ల ప్రాజెక్టు అనుమతులపై అనేక అభ్యంతరాలు వచ్చాయని నిపుణుల కమిటీ తెలిపింది. జీడబ్ల్యూడీటీ , సీడబ్ల్యూసీ సంప్రదింపులు అవసరమని కేంద్ర నిపుణుల కమిటీ వెల్లడించింది. దీంతో బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేక్ పడినట్టు అయింది. ఈ పరిణామంతో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల భవిష్యత్తు , రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

నేటి ప్రభాత సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
WWW. Prabhata surya.com



# కాంగ్రెస్ లో కాకా పుట్టిస్తున్న కొండా

మొదటి పేజీ తరువాయి

దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరో సారి తారాస్థాయికి చేరుకున్నాయి. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి దంపతులు వర్సెస్ స్థానిక ప్రజా ప్రతినిధుల మధ్య కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం నేపథ్యంలో కొండా మురళి ఇచ్చిన ఆరు పేజీల ఫిర్యాదు లేఖపై చర్చించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలు నేడు అత్యవసరంగా భేటీ అయ్యారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా మురళి దంపతులకు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులకు మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో, ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న పరస్పర ఫిర్యాదులపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ విచారణ చేపట్టింది. వారం రోజుల్లో లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆదేశించింది. నిన్న గాంధీభవన్‌లో మల్లు రవి అధ్యక్షతన సమావేశమైన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ, జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులపై కొండా మురళి చేసిన వ్యాఖ్యలపై వివరణ కోరింది. ఈ సందర్భంగా కొండా మురళి తన అనుచరులతో సహా దాదాపు 150 వాహనాలతో గాంధీభవన్‌కు చేరుకుని తన బలాన్ని ప్రదర్శిస్తూ హంగామా సృష్టించారు. అనంతరం, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులపై ఆరు పేజీల ఫిర్యాదు లేఖను కమిటీ చైర్మన్ మల్లు రవికి అందజేశారు. ఈ లేఖలో కొండా మురళి, వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు ఉన్న విభేదాలకు గల కారణాలను సవివరంగా వివరించారు. అంతేకాకుండా, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పైన కూడా తన లేఖలో ప్రస్తావించి, కొండా సురేఖ పైన పొంగులేటి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకునే ప్రయత్నంలోనే ఈ లేఖను అందజేసినట్లు తెలుస్తోంది. క్రమశిక్షణ కమిటీ స్పష్టమైన ఆదేశాలు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ మాత్రం, కొండా మురళి అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. తాము అడిగిన ప్రశ్నలకు మాత్రమే సమాధానం ఇవ్వాలని, కొత్త విషయాలపై వివరణ తమకు అవసరం లేదని తేల్చి చెప్పింది. కొండా మురళి ఇచ్చే సమాధానం ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని, ఎటువంటి ఒత్తిడిలకు లొంగే ప్రసక్తే లేదని కమిటీ పేర్కొంది. క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలకు కొండా మురళి వారం రోజుల్లో ఎలాంటి సమాధానం ఇస్తారు అనేది ఇప్పుడు జిల్లా కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తిగా మారింది. వరంగల్ జిల్లా ప్రజా ప్రతినిధులపై తాను చేసిన వ్యాఖ్యలను పదేపదే సమర్థించుకున్న నేపథ్యంలో, తన వ్యాఖ్యలకు ఏ విధంగా సమాధానం చెబుతారు అనేది కీలకం. కొండా మురళి ఇచ్చే సమాధానం పట్ల క్రమశిక్షణ కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అనేది వేచి చూడాల్సిందే. కొండా మురళిపై కఠిన చర్యలు తీసుకోకపోతే జిల్లాలో తీవ్ర అసంతృప్తితో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఊరుకుంటారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ కఠిన చర్యలకు దిగితే కొండా ఫ్యామిలీ ఏం చేయబోతుంది అనేది కూడా హాట్ టాపిక్‌గా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ, వరంగల్ జిల్లాలో కాంగ్రెస్‌లో మొదలైన ఈ ముసలం ఎక్కడి వరకు వెళుతుందో అనే చర్చ ప్రస్తుతం జోరుగా సాగుతోంది. ఈ పరిణామాలు జిల్లా కాంగ్రెస్ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

# వారి ఫోన్లూ ట్యాప్ చేసుకోవచ్చు

మొదటి పేజీ తరువాయి



దీని ప్రకారం ఇతర రాష్ట్రాల్లోని వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసుకోవచ్చు. అయితే అలా ఫోన్లను ట్యాప్ చేయాలంటే కేంద్ర హోం శాఖ అనుమతి తప్పనిసరి. తెలంగాణలో వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో ఈ ప్రతిపాదన ప్రాధాన్యతను సంతరించుకుంది. గతంలో పీసీసీ, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురి ఫోన్‌లు అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలున్నాయి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా నిఘా కార్యకలాపాలు చట్టబద్ధంగా ఉండేలా ఈ కొత్త నిబంధన దోహదపడుతుందని కేంద్రం భావిస్తోంది.

ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కేంద్రం కొత్త నిబంధనలను ప్రతిపాదించింది. దీని ప్రకారం ఇతర రాష్ట్రాల్లోని వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసుకోవచ్చు. అయితే అలా ఫోన్లను ట్యాప్ చేయాలంటే కేంద్ర హోం శాఖ అనుమతి తప్పనిసరి. తెలంగాణలో వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో ఈ ప్రతిపాదన ప్రాధాన్యతను సంతరించుకుంది. గతంలో పీసీసీ, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురి ఫోన్‌లు అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలున్నాయి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా నిఘా కార్యకలాపాలు చట్టబద్ధంగా ఉండేలా ఈ కొత్త నిబంధన దోహదపడుతుందని కేంద్రం భావిస్తోంది.

రాష్ట్ర సరిహద్దుల వెలుపల ఉన్న వ్యక్తుల ఫోన్‌లను ట్యాప్ చేసే అధికారాన్ని రాష్ట్రాలకు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనను ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన టెలికమ్యూనికేషన్స్ నిబంధనలు–2024 (చట్టబద్ధమైన ట్యాపింగ్‌కు నిబంధనలు, జాగ్రత్తలు) లో సవరణ చేస్తూ కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ ముసాయిదా ప్రకటనను విడుదల చేసింది. ఈ ప్రతిపాదన ఇటీవల తెలంగాణలో వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.

ప్రస్తుతం ఉన్న నిబంధన 2(సి) ప్రకారం, కేంద్ర ప్రభుత్వ పరిధిలో అయితే కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర పరిధిలో రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి మాత్రమే ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతి ఇచ్చే అధికారం కలిగి ఉన్నారు. ఇప్పుడు ప్రతిపాదించిన కొత్త నిబంధన ప్రకారం.. ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం తన ప్రాదేశిక సరిహద్దులకు బయట ఉన్న వ్యక్తుల ఫోన్‌లను ట్యాప్ చేయడానికి కేంద్రం అనుమతి తప్పనిసరి. ఈ ప్రక్రియలో సంబంధిత రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి నుంచి విజ్ఞప్తి అందిన తర్వాత, కేంద్ర హోం శాఖ కార్యదర్శి అనుమతి ఇవ్వడానికి అవకాశం కల్పించారు.

ప్రజా అత్యవసర పరిస్థితి, ప్రజా భద్రత ప్రయోజనాలు వంటి సందర్భాల్లో కేంద్రం గానీ, రాష్ట్రం గానీ ట్యాపింగ్‌కు అనుమతి ఇవ్వొచ్చు. ముఖ్యంగా దేశ సార్వభౌమత్వం, సమగ్రత, దేశ రక్షణ, భద్రత, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు, శాంతిభద్రతల ప్రయోజనాలు కాపాడటానికి లేదా జరగబోయే నేరాన్ని ముందుగా అరికట్టడానికి ఇది అవసరమని అధీకృత అధికారి సంతృప్తి చెందినప్పుడు మాత్రమే ఈ నిబంధనను అమలు చేస్తారు.

ఈ కొత్త నిబంధన ప్రతిపాదన వెనుక తెలంగాణలో గత కొన్ని నెలలుగా సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అప్పటి పీసీసీ, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సహా అనేక మంది రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ అధికారుల ఫోన్‌లను అక్రమంగా ట్యాప్ చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కేసులో పలువురు ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు అరెస్ట్ అయ్యారు.

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో రాష్ట్ర సరిహద్దుల వెలుపల, ముఖ్యంగా ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో ఉన్న కీలక వ్యక్తుల కదలికలను, సంభాషణలను పసిగట్టడానికి చట్టవిరుద్ధంగా ఫోన్‌లను ట్యాప్ చేశారనేది ప్రధాన ఆరోపణల్లో ఒకటి. దీని ద్వారా రాజకీయ ప్రత్యర్థులు, ప్రభుత్వ విధానాలపై విమర్శకులు, మీడియా ప్రతినిధులపై నిఘా పెట్టారని ఆరోపణలున్నాయి. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా నిరోధించడానికి, చట్టబద్ధమైన పద్ధతుల్లో మాత్రమే నిఘా కార్యకలాపాలు జరిగేలా చూడటానికి ఈ కొత్త నిబంధన దోహదపడుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ ముసాయిదా ప్రకటనపై సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను 30 రోజుల్లోపు జాయింట్ సెక్రటరీ (టెలికాం), టెలికమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్, కమ్యూనికేషన్ల మంత్రిత్వశాఖ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, సంచార్ భవన్, 20–అశోకా రోడ్, న్యూఢిల్లీ–110001 చిరునామాకు పంపవచ్చునని చెప్పారు. ఈ నిబంధనలు అంతిమంగా అమలులోకి వస్తే.. దేశంలో నిఘా కార్యకలాపాలు మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరిగే అవకాశం ఉంది.

# సార్క్ స్థానంలో,,,, చైనా, పాక్, బంగ్లా కొత్త కూటమి

మొదటి పేజీ తరువాయి



తీవ్రవాదానికి మద్దతిస్తుందన్న కారణంతో గతంలో 2016లో పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చిన సమావేశానికి గైర్హాజరైంది. అప్పటి నుంచి సార్క్ కూటమి కార్యకలాపాలు గాడితప్పాయి. దీంతో తాజాగా అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో చైనా, పాకిస్తాన్ ఉమ్మడిగా కుట్రకు తెరలేపాయి. ఇప్పటికే భారత్ తో సంబంధాలు అంతంతమాత్రంగా ఉన్న బంగ్లాదేశ్ ను కూడా కలుపుకుని సార్క్ స్థానంలో కొత్త కూటమి ఏర్పాటుకు అడుగులేస్తున్నాయి. కొత్త కూటమిలో భారత్ తో పాటు దక్షిణాసియా దేశాలను సైతం ఆహ్వానించబోతున్నారు. ఈ నెలలో చైనాలోని కున్మింగ్‌లో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్, ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ ప్రతినిధులు చైనా ఆధ్వర్యంలో జరిగిన త్రైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో ఈ కొత్త కూటమిపై మూడు దేశాలూ చర్చించినట్లు పాక్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ కున్మింగ్‌లో జరిగిన సమావేశం ముఖ్య ఉద్దేశం సార్క్ లోని ఇతర దక్షిణాసియా దేశాలను కొత్త కూటమిలో చేరమని ఆహ్వానించడమే అని తెలుస్తోంది. ఈ ఏడాది మే నెలలో చైనా–పాకిస్తాన్–అఫ్ఘానిస్తాన్ మధ్య త్రైపాక్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌ను విస్తరించడం, తాలిబాన్ పాలిత ఇస్లామిక్ ఎమిరేట్‌లో ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడంపై చర్చించారు. అయితే ఈ కొత్త కూటమిపై ఇంకా క్లారిటీ రాకపోవడంతో దీనిపై స్పందించిన బంగ్లాదేశ్.. భారత్ కు వ్యతిరేకంగా తామ్ను ఎలాంటి కూటమి ఏర్పాటు చేయడం లేదని ప్రకటించింది.

# పాశమైలారం పారిశ్రామిక వాడలో భారీ పేలుడు

మొదటి పేజీ తరువాయి




చనిపోయిన వారి కుటుంబాలని ఆదుకోవాలని అన్నారు. ఈ పేలుడు ఘటన పట్ల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే ఈ ఘటన నేపథ్యంలో ఆ ఫ్యాక్టరీ వైపు రావొద్దని అధికారులు సూచించారు. కెమికల్ ఫ్యాక్టరీలో ఈ పేలుడు తీవ్రతకు రియాక్టర్ ఉన్న భవనం కుప్పకూలింది. పక్కనే ఉన్న మరో భవనానికి బీటలు వచ్చాయంటే ప్రమాద తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఘటన జరిగిన ప్రాంతాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పరిశీలించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇదిలా ఉంటే గతంలో కూడా పఠాన్‌చెరు సమీపంలోని ఫ్యాక్టరీలలో ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాద సమయంలో పరిశ్రమలో మొత్తం 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. వెలికితీసిన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రమాద బాధితుల వివరాల కోసం 08455276155 నంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై త్వరలోనే ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి వివేక్ హామీ ఇచ్చారు. అధిక పని గంటలపై కార్మికులు ఫిర్యాదు చేస్తే లేబర్ కమిషన్ దర్యాప్తు చేస్తుందని పేర్కొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. ఈ ఘటనను దురదృష్టకరమని అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత అన్ని విభాగాల అధికారులు సత్వరమే స్పందించారని.. ప్రమాదానికి గల కారణాలను ఇప్పుడే చెప్పలేమని అన్నారు. ఈ పరిశ్రమ 40 ఏళ్లుగా పని చేస్తోందని, మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ పౌడర్‌ను ఇక్కడ తయారు చేస్తారని ఆయన వివరించారు.

### ఘటనా స్థలం వద్ద తీవ్ర ఉద్రిక్తత

పరిశ్రమలో ఇంకా పలువురు కార్మికులు చిక్కుకుపోయారన్న అనుమానంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమ వారి ఆచూకీ చెప్పాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. కార్మికుల కుటుంబాల రోదనలతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఈ ఘటన పారిశ్రామిక భద్రత ప్రమాణాలపై మరోసారి ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రభుత్వం, పరిశ్రమల యాజమాన్యాలు భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పార్టీ విధేయుడికే పట్టం



తెలంగాణలో పార్టీ భవిష్యత్ పైన అధినాయకత్వం భారీ వ్యూహంతో ముందుకెళ్లోంది. ఇదిలావుంటే పార్టీ చీఫ్ గా ఈటల రాజేందర్ ఎంపిక ఖాయమని ప్రచారం సాగిన నేపథ్యంలో పార్టీ అధిష్టానం తీసుకొన్న నిర్ణయం ఆసక్తి కరంగా మారింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావు ఎంపిక వెనుక. ఈటల రాజేందర్ కు పదవి దక్కకపోవడం వెనుక కారణాలు ఏంటనేది ఇప్పుడు పార్టీలో చర్చకు కారణమవుతోంది. ఇదిలావుంటే నేడు కొత్త అధ్యక్షుడిని అధికారికంగా ప్రకటించనున్నారు. కొత్త అధ్యక్షుడి ఎంపిక ఏకగ్రీవంగా పూర్తి చేసేందుకు బీజేపీ అధినాయకత్వం అంతా తానై తతంగం నడిపినట్లు తెలుస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా తెలంగాణ పై ఫోకస్ చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఎంపికపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపినట్లు తెలుస్తోంది. ఈ ఎంపిక ద్వారా పార్టీ హైకమాండ్ తన స్పష్టమైన సంకేతాలను పార్టీ నేతలకు పంపినట్లు తెలుస్తోంది. పార్టీ విధేయుడిగా, సౌమ్యుడిగా గుర్తింపు పొందిన రాంచంద్రరావుకు సంఘ్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు మద్దతు ప్రకటించినట్లు సమాచారం. పార్టీ సైద్ధాంతిక నేపథ్యం పట్ల సంపూర్ణ అవగాహన ఉన్నవారికే అధ్యక్ష పీఠం కట్టబెట్టాలనే ఉద్దేశంతోనే రాంచందర్‌రావు ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. విద్యార్థి దశ నుంచి ఏబీవీపీ, బీజేపీ యువ మోర్చా, పార్టీలో వివిధ హోదాల్లో రాంచందర్‌రావు పని చేసారు. పార్టీ ఇబ్బందుల్లో ఉన్న అనేక సందర్భాల్లో రాంచందర్‌రావు మద్దతుగా నిలిచారు. పార్టీలోని అందరి నేతలతోనూ సత్సంబంధా లు కలిగిన నేతగా రాంచంద్రరావుకు గుర్తింపు ఉంది. మరోవైపు, పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ పేరు కూడా రాష్ట్ర అధ్యక్షుడి తుది జాబితాలో ఉన్నట్లు ప్రచారం సాగినా పార్టీకి సుదీర్ఘ కాలం సేవలు అందిస్తున్న రాంచందర్‌రావు కు అవకాశం ఇచ్చారు. దీని ద్వారా పార్టీని నమ్ముకున్న వారికి మంచి అవకాశాలు వస్తాయనే సంకేతాలను పార్టీ ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పదవి కోసం రాంచంద్రరావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఇప్పుడు అధ్యక్ష పదవి ఏకగ్రీవం కానుంది. నేడు దీనిపై అధికారిక ప్రకటన రానున్నది. అందరినీ కలుపుకొని పోయే మనస్తత్వం ఉన్న రాంచందర్ రావు తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడానికి ఎప్పటి నుంచో కృషి చేస్తున్నారు. ఆయనకు క్షేత్రస్థాయిలోనూ అందరితో బలమైన సంబంధాలు ఉండటం బీజేపీకి కలిసి రానుంది. రాంచందర్ రావుకు పార్టీలో దీర్ఘకాలిక అనుభవం, సంస్థాగత పట్టు ఉండటం, అలాగే వివిధ వర్గాల మద్దతు ఉండటం వంటివి ఆయన ఎంపికకు దోహదపడ్డాయి. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలతో ఆయనకున్న అనుబంధం, పార్టీ సిద్ధాంతాలపై ఆయనకున్న నిబద్ధత కూడా ఈ నిర్ణయానికి కారణాలని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలావుంటే తెలంగాణ రాజకీయాల పట్ల బీజేపీ గత కొంత కాలంగా ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో దూకుడుగా వ్యవహరించే నేతల కంటే. వివాద రహితుడు, అందరిని కలుపుకొని పోయే మనస్తత్వం ఉన్న రాంచందర్ రావును ఎంపిక చేయడమే బెటర్ అనే అభిప్రాయానికి కమల నాథులు వచ్చారట. అధినాయకత్వం ప్రాధాన్యాలను అర్థం చేసుకుంటూ, క్షేత్ర స్థాయిలో పార్టీ బలం పెంచేలా కృషి చేస్తూ.. తెలంగాణలో బీజేపీని మరింత బలోపేతం చేసే చాణక్యం, నేర్పు రాంచందర్ రావుకు ఉన్నాయని ఆప్షన్ అధిష్టానానికి కనబడటంతో ఆయన ఎంపిక లాంచనంగా మారింది. అంతగా అవసరమైతే, వచ్చే ఎన్నికల నాటికి అప్పటి పరిస్థితులకు తగ్గట్టుగా కొత్త అధ్యక్షుణ్ని నియమించొచ్చనే ఆలోచనలో బీజేపీ పెద్దలు ఉన్నారట. అంతే కాదు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్ రావు అభ్యర్థిత్వానికి బండి సంజయ్ బలంగా మద్దతు పలికారని. అవసరమైతే ఎన్నికల ముందు మళ్లీ సంజయ్‌కే బీజేపీ పగ్గాలు దక్కుతాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీకి, తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి అందించినట్లు తెలిపారు. బీజేపీ అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు సిద్ధం కాగా తన మద్దతుదారులను బెదిరించారని రాజాసింగ్ ఆరోపించారు. పార్టీ అధ్యక్ష ఎంపిక ముందే జరిగిందని. బీజేపీ ఓడిపోవాలని కోరుకునేవారు పార్టీలోనే ఉన్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కిషన్ రెడ్డే స్వయంగా తన ఎమ్మెల్యే రాజీనామా లేఖను స్పీకర్‌కు పంపాలని కోరారు. అంతేకాకుండా బీజేపీ నూతన అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచదర్‌రావు పేరు ఖారరు చేయడంతో దీనిపై రాజాసింగ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ సోమవారంనాడు మధ్యాహ్నం ఓ వీడియో రిలీజ్ చేశారు. పార్టీలో బూతు స్థాయి నుంచి కీలక నేతల వరకు అందరూ కలిసి పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోవాలని ఆయన కోరారు. ఏక పక్షంగా అధ్యక్షుడిని ఎంపిక చేయటం సరైన నిర్ణయం కాదని అన్నారు. అయితే ఆయన గతంలోనూ పలుమార్లు పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రాజీనామా చేస్తానని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుల నియామకంపైనా రాజాసింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడి నియామకం విషయంలో పార్టీ తన సూచనలను పట్టించుకోలేదని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను వెనుకబడిన తరగతులు (బీసీ) లేదా షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) చెందిన వ్యక్తిని నియమించాలని కోరితే తనన సూచనను పట్టించుకోలేదన్నారు. మరోవైపు రాజాసింగ్ రాజీనామాపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే ఆ లేఖను స్పీకర్ కు పంపాలని పార్టీకి కాదని సూచించింది. రాజాసింగ్ చేస్తున్న ఆరోపణలలో వాస్తవంలేదని కొట్టిపారేసింది.

### ఈటలకు చెక్ పెట్టిందెవ్వరూ...?

బీజేపీ పగ్గాలు ఈటల రాజేందర్ కు దక్కుతాయన్న ప్రచారం బాగా సాగింది. బీసీకి పార్టీ పగ్గాలు అప్పగిస్తే ఈటల రాజేందర్ కు ఇస్తారని ప్రచారం సాగింది. ఒక దశలో ఈటల పేరు ఖాయమైనట్లు ఢిల్లీ సర్కిల్స్ లో వినబడింది. బండి సంజయ్ ను కేంద్ర మంత్రి చేయటంతో ఈటల రాజేందర్ కు లైన్ క్లియర్ అయిందని భావించారు. కానీ ఆయన పేరు అనూహ్యంగా కనుమరుగైంది. దీనికి కారణం లేకపోలేదు. బీఆర్ఎస్ నుంచి ఆయన వలస రావడం ఒక కారణమైతే గతంలో బండి సంజయ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చోటు చేసుకున్న పరిణామాలు. ఆ సమయంలో ఈటల ఢిల్లీకి ఫిర్యాదుల వ్యవహారం ఇప్పుడు ఆయన ఎంపిక కాకుండా ప్రభావం చూపినట్లు చర్చ జరుగుతోంది. గతంలో పార్టీ ప్రెసిడెంట్ గా బండి సంజయ్ ఉన్న సమయంలో పెద్ద ఎత్తున్నఈటల రాజేందర్ తిరుగుబాటు చేశారు. తెలంగాణ బీజేపీ లో నడిచిన కోల్డ వార్, ఢిల్లీ నివేదికలు. ముఖ్య నేతల అభిప్రాయాలతో ఇప్పుడు కొత్త వివాదాలకు తావు లేకుండా రాంచందర్‌రావు పేరు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ టల రాజేందర్ కు పార్టీ పగ్గాలు అప్పగిస్తే బండి సంజయ్ వర్గంతోపాటు పార్టీలోని సీనియర్ల నుంచి తీవ్ర విముఖత వచ్చే అవకాశాలున్న నేపథ్యంలో రాంచంద్రరావుకు పార్టీ పగ్గాలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపించినప్పటికీ, పార్టీలోని సీనియర్ నాయకులు ఆయనకు అధ్యక్ష పదవి దక్కకుండా వ్యూహాత్మకంగా అడ్డుకున్నారని తెలుస్తోంది. వారి ప్రయత్నాలు ఫలించి, ఈటలకు చెక్ పడిందని, ఆయన ఆశలకు గండి కొట్టినట్టైందని రాజకీయ వర్గాల్లో చర్చ చక్కర్లు కొడుతోంది.

కిషన్ రెడ్డి కంటే ముందు తెలంగాణ అధ్యక్షుడిగా బీసీ సామాజికవర్గానికి చెందిన బండి సంజయ్ వ్యవహరించారు. ఆయన నాయకత్వంలో పార్టీ తెలంగాణలో బాగా పుంజుకుంది. కానీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు అనూహ్యంగా ఆయన స్థానంలో కిషన్ రెడ్డికి పగ్గాలు అప్పగించారు. రాష్ట్రంలో బీసీల జనాభా ఎక్కువ కావడంతో.. మరోసారి బీసీ నేతకే పార్టీ పగ్గాలు అప్పగిస్తారని చాలా మంది భావించారు. కానీ ఆరెస్సెస్ అండదండలు పుష్కలంగా ఉన్న రాంచందర్ రావును ఆ పదవి వరించింది. ఏపీలోనూ మొదటి నుంచి బీజేపీతోనే ఉన్న మాధవ్‌కు ఆ పార్టీ పగ్గాలు దక్కుతుండటం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం.

### ఒక్క దెబ్బకు రెండు పిట్టలు

ఓ వైపు అసమ్మతి గళాలకు చెక్ పెడుతూనే సమీప భవష్యత్తులో ఎన్డీయే కూటమి తో పోటీ చేయాల్సి వస్తే వాటి సమన్వయం కోసం కూడా పార్టీ అధ్యక్షుడిగా రాంచంద్రరావును ఎంపిక చేయడానికి కారణమైందని తెలుస్తోంది. పార్టీ అధ్యక్షుడిగా రామచందర్ రావు నియామకం ద్వారా భవిష్యత్తులో తెలంగాణ బీజేపీలో తెలుగుదేశం సానుకూల ధోరణి పెరిగే అవకాశం ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నిర్ణయం పార్టీకి ఎంతవరకు లాభిస్తుంది, చంద్రబాబు ప్రభావం ఏ మేరకు ఉంటుంది అనేది కాలమే నిర్ణయించాలి.-పార్టీ బలోపేతమే లక్ష్యం పార్టీని బలోపేతం చేయడం, కాంగ్రెస్ అధికారాన్ని సమర్థంగా ఎదుర్కోవడం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సిద్ధం చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లుగా సమాచారం. అందువల్లే పోటీ లేకుండా సమ్మతితో రామచందర్ రావు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్టు తెలుస్తోంది.

# మీ ఇద్దరికి ఉరిలేదా శిలువ

మీ ఇద్దరికి ఉరిలేదా శిలువ

ట్రంప్, నెతన్యాహుకు హెచ్చరిస్తూ..ఇరాన్ మతాధికారి ఫత్వా

యుద్ధ వాతావరణం మళ్లీ రగులుతుందా....?

కొన్ని సార్లు మాటలే యుద్ధాలకు దారి తీస్తాయి. అలాంటి మాటలు యుద్ధం వాతావరణం కాస్త చల్లారుతున్న తరుణంలో వస్తే పరిస్థితి ఎలా ఉంటుంది. ఇపుడు ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో ఇరాన్ లోని అగ్రశేణి మతాధికారి జారీ చేసిన ఫత్వా చర్చకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం ముగిసినా దాని ప్రకంపనలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఇరాన్ తో అణు చర్చలు విఫలమయ్యాక ఇజ్రాయెల్ సాయంతో ఆ దేశంపై పరోక్ష యుద్ధం ప్రారంభించిన అమెరికా ఆ తర్వాత నేరుగా రంగంలోకి దిగి బాంబులేయడం, దీనికి ప్రతిగా ఇరాన్ కూడా పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాల్ని టార్గెట్ చేయటంతో కాల్పుల విరమణకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధం కావడం తెలిసిందే. అయితే ఈ అవమానాన్ని జీర్ణించుకోలేక ట్రంప్ ఇరాన్ పై విమర్శలకు దిగారు.

ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని తాను అవమానకర చావు నుంచి కాపాడానని, అయినా ఆయన కృతజ్ఞత చూపడం లేదంటూ తాజాగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, త్వరలో జరిగే మరో దఫా చర్చల్లో తమ డిమాండ్లకు అంగీకరించాలంటూ చేస్తున్న డిమాండ్లను ఖమేనీ పట్టించుకోకపోవడం ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీంతో ఇరాన్ పై ఆంక్షలు ఎత్తేయాలని ముందు అనుకున్న ట్రంప్ ఆ తర్వాత ఈ నిర్ణయంపై వెనక్కి తగ్గారు. ఈ నేపథ్యంలో ఇరాన్ కూడా అమెరికా తీరుపై మండిపడుతోంది.

ఇదే క్రమంలో ఇరాన్‌లోని అగ్రశ్రేణి షియా మతాధికారి గ్రాండ్



అయతుల్లా నాజర్ మకరెం షిరాజీ .. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహులపై ఓ ఫత్వా జారీ చేశారు. వీరిద్దరూ "దేవుని శత్రువులు" అని పేర్కొంటూ , ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఐక్యంగా ఉండి ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వాన్ని బెదిరిస్తున్న వీరిద్దరినీ ఓడించాలని పిలుపునిచ్చారు. తమ ప్రియతమ నేతను లేదా నాయకుడిని బెదిరించే ఏ వ్యక్తి అయినా, ప్రభుత్వమైనా యుద్ధ నాయకుడు లేదా మెహరేబ్ గా పరిగణిస్తామని, అంటే దేవునికి వ్యతిరేకంగా యుద్ధం చేసే వ్యక్తి అని తన ఫత్వాలో తెలిపారు. ఇరాన్ చట్టం ప్రకారం, మొహరేబ్‌గా గుర్తించబడిన వారు ఉరిశిక్ష, శిలువ వేయడం, అవయవాలను విచ్ఛేదనం చేయడం లేదా బహిష్కరించబడతారని పేర్కొన్నారు. ముస్లింలు లేదా ఇస్లామిక్ దేశాలు ఆ శత్రువుకు అందించే ఏదైనా సహకారం, మద్దతు హరామ్ లేదా నిషిద్ధమని ఫత్వా తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలందరూ ఈ శత్రువులు తమ మాటలు, తప్పులకు పశ్చాత్తాపపడేలా చేయడం అవసరమని వెల్లడించింది. తన ముస్లిం విధికి కట్టుబడి ఉండే ముస్లిం తమ ప్రచారంలో కష్టాలను లేదా నష్టాన్ని ఎదుర్కొంటే, వారు దేవుని మార్గంలో పోరాట యోధునిగా, దేవుడు ఇష్టపడితే ప్రతిఫలం పొందుతారని కూడా అది పేర్కొంది.

## విద్వేషపూరిత పోస్టులకు అవకాశం లేదు - మందమర్రి ఎస్సై రాజశేఖర్ హెచ్చరిక



మందమర్రి.నేటి ప్రభాత సూర్య జూన్ 30.మందమర్రి: సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యానాలు, పోస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవని మందమర్రి ఎస్సై రాజశేఖర్ స్పష్టం చేశారు.కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు రగిలించేలా ఉండే పోస్టులు, వీడియోలు, ఫోటోలు, దుష్ప్రచారాలు షేర్ చేయడం చట్టవిరుద్ధమని . హెచ్చరించారు. ఫేస్బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపులు వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరులను కించపరిచే విధంగా పెట్టే పోస్టులపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.ధృవీకరణ లేకుండా వీడియోలు, ఫోటోలు ఫార్వర్డ్ చేసినా కూడా కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించిన ఎస్సై, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఇలాంటి అక్రమ కంటెంట్ కోసం ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో ఇటువంటి కంటెంట్ షేర్ అయితే, గ్రూప్ అడ్మిన్లపై కూడా బాధ్యత వుంటుందని హెచ్చరించారు.సామాజిక మాధ్యమాలు మంచికే ఉపయోగించాలి. శాంతి, భద్రతలకు భంగం కలిగించేలా వాడితే చట్టం గట్టిగా స్పందిస్తుంది," అని ఎస్సై రాజశేఖర్ తేల్చిచెప్పారు.

## జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏఐటీయూసీ ఏడవ స్ట్రక్చర్ కమిటీ మీటింగ్



మంచిర్యాల జిల్లా నేటి ప్రభాత సూర్య. జూన్ 30.మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.దేవేందర్ అధ్యక్షతన గుర్తింపు సంఘం (ఏ.ఐ.టి.యు.సి) యూనియన్ తో 7 వ స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహించడం జరిగింది.సింగరేణి కార్మికుల పలు సమస్యలపై జి.ఎం జి.దేవేందర్. అధ్యక్షతన మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఈ రోజు తేదీ: 30.06.2025, నాడు గుర్తింపు కార్మిక సంఘం (ఏ.ఐ.టి.యు.సి) మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ,రామకృష్ణాపూర్ సెక్రటరీ అక్బర్ అలీ, మరియు ఏఐటి యుసి. నాయకులతో నిర్మాణాత్మక సమీక్షా సమావేశం జరిగింది.ఈ సమావేశం లో జి.ఎం జి.దేవేందర్. గుర్తింపు సంఘం నాయకులతో మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో ఉత్పత్తి ఉత్పాదకత లో కార్మిక సంఘాల పాత్ర చాలా కీలకమైనది అని సింగరేణి సంస్థ ఉత్పత్తి మరియు ఉత్పాదకత లోనే కాకుండా ఉద్యోగుల సంక్షేమానికి కూడా ఎక్కువ ప్రదాన్యతను ఇస్తుంది అని తెలిపారు. ఈ సందర్భంగా గడిచిన సమావేశంలో జరిగిన పనుల యొక్క పురోగతి గురించి చర్చించారు.ఈ సందర్భంగా జి.ఎం జి.దేవేందర్. మాట్లాడుతూ గుర్తింపు సంఘం నాయకులు ప్రస్తావించిన పనులను పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు, ఇప్పటి వరకు ఏవిధముగా ఉత్పత్తి లక్ష్య సాధనలో సహకరించారో ఇక ముందు కూడా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్,మందమర్రి ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, ఎస్.కె. గ్రూప్ ఏజెంట్ ఖాదీర్,ఐ.ఈ.డి, ఎస్.ఈ కిరణ్ కుమార్, సివిల్ ఎస్.ఇ రాము, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, సీనియర్ అధికారులు, ఏఐటీయూసీ. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాంస్కృతిక శాఖ సలహాదారులుగా అంతడుపుల నాగరాజు



మందమర్రి నేటి ప్రభాత సూర్య.జూన్ 30: తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహాదారులుగా మందమర్రి పట్టణానికి చెందిన తెలంగాణ ధూమ్ ధామ్ ఫౌండర్ అంతడుపుల నాగరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో తెలంగాణ సంస్కృతిని సంప్రదాయాలని పరిరక్షించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అడ్వైజర్ కమిటీని ఏర్పాటు చేసింది. అడ్వైజర్ కమిటీ చైర్మన్గా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ సభ్యులుగా గుమ్మడి వెన్నెల గద్దర్, ప్రొఫెసర్ అలేఖ్య పుంజల, సుద్దాల అశోక్ తేజ, నరసింగరావు, జయరాజ్, సంగీశెట్టి శ్రీనివాస్, ప్రొఫెసర్ కోయి కోటేశ్వర్ రావు, డాక్టర్ పసునూరి రవీందర్, దరువు ఎల్లన్న, అంతడుపుల నాగరాజు, ఏపూరి సోమన్న, ఉస్తాద్ డాక్టర్ చౌదరిపల్లి రవికుమార్, నేర్నాల కిషోర్, పల్లె నరసింహ, డాక్టర్ ఖాజా పాషా, యాకూబ్, జూకంటి జగన్నాథం, దరువు అంజన్న, డాక్టర్ మామిడి హరికృష్ణ లను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రత్యేక బస్సులను నడపండి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్:



నేటి ప్రభాత సూర్య ఉమ్మడి ఆదిలాబాద్ ఇంచార్జి జూన్ 30: ఏజెన్సీ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడపాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎం ప్రతిమా రెడ్డి ని ఆదేశించారు.సోమవారం



ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎం ప్రతిమా రెడ్డి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ని మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు.అనంతరం ఎమ్మెల్యే డిఎంతో మాట్లాడుతూ...ఉట్నూర్ నుండి జైనూర్ వయా లింగాపూర్, ఉట్నూర్ నుండి ఇందన్ పల్లి వయా జగిత్యాల, ఉట్నూర్ నుండి కలమడుగు, గోడిసిర్యాల,కడెం,ఖానాపూర్ వరకు, ఉట్నూర్ నుండి నిర్మల్ కు బస్సులను నడపాలని ఆదేశించారు.ఆదిలాబాద్ నుండి ఉట్నూర్ కు రాత్రి పూట వచ్చే 8 గంటల బస్సు టైంను పొడిగించాలన్నారు.ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని బస్సులను నడపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా కాలనీ నూతన కమిటీ ఎన్నిక





షాద్ నగర్ నేటి ప్రభాత జోన్ ఇంచార్జ్ (జూన్ 30):షాద్ నగర్ పట్టణంలో ని సాయిబాబా కాలనీ నూతన అభివృద్ధి కమిటీ సోమవారం కాలనీ యువకులు పెద్దలు సమావేశమై కాలనీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మంగ శంకర్ (ఏ ఎస్ ఎస్ జి) ఎన్నికైనారు, ప్రధాన కార్యదర్శిగా బొబ్బిలి గ్రామ శ్రీనివాసులు, ట్రెజరర్ గా కిరాణాషాప్ శ్రీశైలం, గౌరవ అధ్యక్షులుగా ఆంజనేయులు గౌడ్, ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులు మాట్లాడుతూ..సాయిబాబా కాలనీ నూతన అభివృద్ధి కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని కాలనీ పెద్దలకు యువకులకు ధన్యవాదాలు తెలిపారు. కాలనీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. కాలనీలో యువ కులు పెద్దలు అభివృద్ధి మరియు విద్య ఉపాధి ఆరోగ్యం, తదితర రంగాలలో సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. కాలనీ కమిటీ అనేది ఒక కాలనీలోని నివాసితులు కలిసి ఏర్పరచుకున్న ఒక సమూహం ఈ కమిటీ కాలనీలో అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుంది అన్నారు. కాలనీ కమిటీ పాత్ర కాలనీ అభివృద్ధి,కాలనీలో రోడ్లు, నీటి సరఫరా, వీధి దీపాలు, పచ్చదనం వంటి వాటిని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుంది.కాలనీలో తలెత్తే సమస్యలైన నీటి ఎద్దడి, విద్యుత్ అంతరాయాలు, పారిశుద్ధ్య సమస్యలు మొదలైన వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తుంది.కాలనీ నివాసితుల సంక్షేమం కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఆరోగ్య శిబిరాలు, పండుగలు, సామాజిక కార్యక్రమాలు.స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ కాలనీ అభివృద్ధికి సంబంధించిన పనులు చేపడుతుంది,అని తెలిపారు.కాలనీ నివాసితులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తుంది.కమిటీ సభ్యులు కాలనీ అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారు.కమిటీ తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడానికి, పనులను పర్యవేక్షించడానికి కమిటీ సభ్యులు కృషి చేస్తారు. అని తెలిపారు.కాలనీ అభివృద్ధి కోసం వచ్చిన నిధులను సక్రమంగా నిర్వహించాలి.కాలనీ నివాసితులతో సమన్వయంతో పనిచేయాలి. కాలనీ కమిటీ అనేది కాలనీ అభివృద్ధికి, నివాసితుల సంక్షేమానికి ఎంతో ముఖ్యమైనది.కాలనీ కమిటీ పనితీరు కాలనీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది.ప్రతి కాలనీలో కాలనీ కమిటీ లు ఉండటం అవసరం, అని అన్నారు. అనంతరం కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న ఏరుకొండ రాము



ప్రభాత సూర్య న్యూస్ కొండమల్లేపల్లి జూన్ 30: కొండమల్లేపల్లి మండల కేంద్రంలో సోమవారం ఉదయం ఆర్టీసీ బస్టాండ్ లో వృద్ధురాలి కాలిపై ప్రైవేట్ ఆర్టీసీ బస్సు వెళ్ళింది. దీంతో తీవ్ర రక్తస్రావమై ఆ వృద్ధురాలు బోరున విలపిస్తూ ఆర్తనాదాలు చేసింది. కొందరు 108 వాహనానికి ఫోన్ చేశారు.సమాచారం అందుకున్న వేరుకొండ రాము సంఘటన స్థలానికి వెళ్లి ప్రైవేట్ అంబులెన్స్ లో సాధారణ వృద్ధురాలని



దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించాడు రక్తపు మడుగులో ఉన్న అతి వృద్ధురాలని అంబులెన్స్ లో ఎక్కించేందుకు ఎవరుకు ముందు రాఘవ రాకపోవడంతో అక్కడే ఉన్న నేలపట్ల.వెంకటేష్ అనే యువకుడు సహాయం చేశారు దీంతో గాయపడిన మహిళను ఆంబులెన్స్ ఎక్కించి దేవరకొండ తరలించడం జరిగింది ఈ సందర్భంగా పలువురు అభినందించారు

## అయ్యప్ప స్వామి ఆలయంలో చోరీ



ఇబ్రహీంపట్నం-నేటిప్రభాతసూర్య (జూన్ 30)రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామంలో నెలకొనిఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం చోరీ జరిగింది. ఈ ఘటనలో దుండగులు ఆలయ తలుపు గడియ పగలగొట్టి అందులోకి ప్రవేశించి సుమారు 2లక్షల విలువ గల పంచలోహ విగ్రహాలను అపహరించుకపోయారు. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## పరిష్కరించాలి.... అదనపు కలెక్టర్ డి.వేణు

:ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు ప్రజల అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. పెద్దపల్లి మండలం పెద్ద బొంకూరు గ్రామానికి చెందిన రమేష్ తనకు గ్రామ శివారు లో మొత్తం 2 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, దీనికి పట్టా పుస్తకం సైతం ఉందని, రైతు బంధు పథకం అమలు కావడం లేదని, తనకు రైతు బంధు అమలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా వ్యవసాయ అధికారిక రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.రామగుండం మండలం కుందనపల్లి గ్రామానికి చెందిన వేల్పుల అనూష తమకు అర్హతలు ఉన్నప్పటికీ గృహ జ్యోతి పథకం అమలు కావడంలేదని, గృహ జ్యోతి పథకం అమలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎస్ఈ విద్యుత్ శాఖ అధికారిక రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.పెద్దపెల్లి పట్టణంలోని తాజ్ కాలనీ రోడ్డు కు చెందిన అస్మిత్ జహన్ తనకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ప్రజావాణిలో జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 67 దరఖాస్తుల స్వీకరణ

:ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరి స్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 67 మంది తమ సమస్యల పరిష్కరం కోసం దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ్ రావులతో కలసి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి ఆర్ &బి ఇ ఇ గా మోహన్

కామారెడ్డి రోడ్లు భవనాలు శాఖ (ఆర్&బి)ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇ ఇ ) గా పి .మోహన్ సోమవారం బాధ్యతల స్వీకరించారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కె. రవి శంకర్ నుంచి ఈ మేరకు అయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రోడ్ల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటానని మోహన్ పేర్కొన్నారు. ఆర్ %b% బి శాఖ అధికారులు, సిబ్బంది నూతనంగా ఇ ఇ గా బాధ్యతలు చేపట్టిన పి . మోహన్కు అభినందనలు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ ను కలిసి పూల బొక్కే అందించారు

## అర్హులైన ప్రతి పేదలకు సంక్షేమ పథకాలు అమలు.

### నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

: నకిరేకల్ నియోజకవర్గం చిట్యాల మున్సిపాలిటి పరిధిలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ గడిచిన ప్రభుత్వంలో అసంపూర్తిగా వదిలేసిన 240 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు పంపిణి చేస్తాం.. ఆనాడు ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు చిట్యాల కేంద్రం లో ఈ ఇండ్లను కట్టిచ్చినం.. పోయినఎమ్మెల్యే కు వీటిని లబ్ధిదారులకు పంపిణి చేయటం చేతకాలే అన్నారు.ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళీఅయన అనుమతి తోలబ్దిదారులను ఎంపిక చేసి ప్యాచ్ వర్క్ కింద ఆ ఇంటికి ఎంత ఖర్చు వస్తాదో ఆ యాజమానికి ఇవ్వడం జరుగుతుంది..!!ఈ ఇండ్లకు రవాణా సదుపాయాలు,,సబ్ రోడ్డు, కంపోండ్ వాల్ ని నిర్మాణం చేస్తాం అన్నారు .త్వరలో లబ్దిదారులను ఎంపిక చేసి ఇండ్లలను పంపిణీ చేస్తాం అన్నారు..ఇవి కాకుండా సోంత స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు ప్రత్యేకంగా మంజూరు చేస్తాం అన్నారు .ఈ ప్రభుత్వం ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందనీ చెప్పారు...పట్టణంలో ప్రతి పేదవారికి ఇండ్లలను అందిస్తాం..ఎవ్వరు అధైర్య పడవొద్దుఅన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలిజిల్లా కలెక్టర్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 127 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీ.డీ.రాజేందర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ప్రజావాణికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ స్కూలు మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలి...ఏఐఎస్ఎఫ్ రఘురాం డిమాండ్...

)అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని సుభాష్ నగర్ లో గల నారాయణ స్కూల్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నిజాంబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రఘురాం అంజలి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు నారాయణ విద్యాసంస్థల ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. దాంట్లో భాగంగానే నిజామాబాద్ నగరంలోని నారాయణ స్కూల్ ముందట ధర్నా నిర్వహిస్తూ నారాయణ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను జలగల్లేక్క రక్తం పిలుస్తూ వేల కొద్ది రూపాయలు ఫీజులు రూపంలో వసూలు చేస్తున్నారన్నారు. అదే కాకుండా స్టేషనరీ పేరు తో ఒక విద్యార్థి దగ్గర 21 వేల రూపాయలు వసూలు చేస్తున్నటువంటి పరిస్థితి ఉంది వెంటనే దీని పైన విద్యాశాఖ అధికారులు స్పందించి నారాయణ విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని దాంతోపాటు ఫీజు నియంత్రణ చట్టం అమలు అయ్యే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు డిమాండ్ చేశారు. తక్షణమే నారాయణ విద్యాసంస్థల మీద చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పిలుపు ఇస్తామని అన్నారు. ఈ దర్న కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కుషాల్, నాయకులు నవీన్ కృష్ణ ,టోకు,లక్ష్మణ్ ,రమేష్,దినేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను ఘనంగా సన్మానించిన పోలీస్ కమీషనర్ గారు.

రామగుండం పోలీస్ కమిషనరేట్లో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి నేడు ఉద్యోగవిరమణ పొందిన పోలీస్ అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కరించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన కార్యక్రమములో ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులు ఎస్.ఐ కె. వెంకటేశ్వర్ రావు, ఎన్ చంద్రశేఖర్, ఎం. అంజయ్య ఆర్ఐ లను పోలీస్ కమిషనర్ పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించడంతో పాటు, వారికి జ్ఞాపికలను అందజేసారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.... సుదీర్ఘ కాలం క్లిష్టమైన పరిస్థితుల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రస్తుతం పదవీవిరమణ చేస్తున్న పోలీస్ అధికారులు వారి పదవీ సమయంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవడంతో పాటు, కొన్ని సమయాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించి వీరు భవిష్యత్తు తరం పోలీసులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని, ఉద్యోగవిరమణ చేసిన పోలీసు అధికారులు తమ ఆరోగ్యం కోసం నిరంతరం యోగ లేదా వ్యాయామాన్ని కొనసాగించడంతో పాటు, వారి కుటుంబ సభ్యులతో సమయాన్ని కేటాయించాలని శేష జీవితం కుటుంబ సభ్యులు పిల్లలతో హాయిగా ఆనందోత్సవాలతో జీవితం గడపాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ డీసీపీ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సిసి ఆర్ బి ఇన్స్పెక్టర్ సతీష్, ఆర్ఐ లు దామోదర్, మల్లేశం, వామన మూర్తి, శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచ లింగం పాటు పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## మంచినీరు, డ్రైనేజీ సమస్యలు తెలెత్తకుండా చర్యలు -కార్పొరేటర్ రాగం..నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి డివిజన్ లోని కాలనీలల్లో, బస్తీలలో డ్రైనేజీ సమస్యలపై జలమండలి అధికారులు వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ కృష్ణ వారి బృందంతో కలిసి ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..పొంగుతున్న డ్రైనేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. అధికారులు, వివిధ శాఖలతో అధికారులతో కలిసి ఒకరికోకరు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. పాపిరెడ్డి నగర్, హెచ్ఏఎల్ కాలనీ, పలు బస్తీలలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అందుకు జిఎం కృష్ణ స్పందిస్తూ కార్పొరేటర్ ఆదేశాల మేరకు డివిజన్ లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు

# ఎంపీడీవో ను సన్మానించిన దేరంగుల ఈశ్వర్



యాచారం నేటి ప్రభాత సూర్య (జూన్ 30):. యాచారం మండల పరిషత్ కార్యాలయంలో యాచారం ఎంపీడీవో కే రాధ రాణి నీ వికలాంగుల మండల అధ్యక్షుడు దేరంగుల ఈశ్వర్ శాలువతో సన్మానించారు. సోమవారం ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వికలాంగుల అభివృద్ధికి తోడ్పడుతానని హామీ ఇచ్చారు. వికలాంగులకు ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను అమలు చేస్తామని అన్నారు. ఎంపీడీవోకు వికలాంగుల నాయకులు కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల్ గ్రామ శాఖ అధ్యక్షుడు పోశయ్య, నేనావత్ చందర్, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల హాస్టల్ పెండింగులో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయండి

### అడిషనల్ కలెక్టర్ ను కోరిన టీజీసీఏ నాయకులు జగన్

### క్యాటరింగ్ కాంట్రాక్టర్లను ఆదుకోవాలి



యాచారం నేటి ప్రభాత సూర్య (జూన్ 30):. గురుకుల పాఠశాలలో, పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్ ను రంగారెడ్డి జిల్లా టిజిసిఏ గురుకుల కాంట్రాక్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సామర్ది జగన్ కోరారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 2024 2025 సంవత్సరములో గురుకుల హాస్టల్ కి రాణం, కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, గుడ్లు, క్యాటరింగ్ విద్యార్థులకు సప్లై చేస్తున్నామని తెలిపారు. కానీ గత నాలుగు నెలల నుండి బిల్లులు రాక, డైట్ చార్జెస్ 40 శాతం పెంచినప్పటికీ, కాంట్రాక్టర్లకు పెంచలేదని తెలిపారు. కాంట్రాక్టర్స్ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో సంబంధిత ప్రిన్సిపల్ కి లిఖితపూర్వకంగా తెలపడం జరిగింది. లేనియెడల జులై 5 న సప్లై సర్వీసును బంద్ చేయాలని మా సంఘం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దుర్గని శ్రీనివాస్, సహకార దర్శి కురువ శ్రీనివాస్, క్యాటరింగ్ సహకార దర్శి ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్దింటి జగన్నాథ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.




# బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన కొయ్యల ఏమాజి



బెల్లంపల్లి నేటి ప్రభాత సూర్య జూన్ 30:భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్ రావు ఎన్నిక పట్ల బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాదికి, పార్టీ విధేయునికి దక్కిన గౌరవంగా అభివర్ణించారు. ఆయన క్రమశిక్షణ కలిగిన గొప్ప నాయకుడు అని తెలిపారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన పేరును ప్రపోజ్ చేసే అవకాశం నాకు కల్పించి గౌరవం కల్పించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఆయన నామినేషన్ పత్రాలపై కొయ్యల ఏమాజి, అరుముల్ల పోషం ప్రపోజ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన రామచందర్ రావు ను అభినందించారు.

# గురుకులంలో స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు




బెల్లంపల్లి నేటి ప్రభాత సూర్య జూన్ 30 : బెల్లంపల్లి పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ కాసిపేట గురుకుల పాఠశాల, కళాశాలలో స్టూడెంట్స్ అకాడమిక్ యాక్టివిటీలో భాగంగా సోమవారం స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్ కుమార్ మాట్లాడుతూ కెప్టెన్ ,వైస్ కెప్టెన్ ఎన్నిక కొరకు ప్రజా పద్ధతిలో ఎన్నికలు నిర్వహణ కోసం విద్యార్థులు ఎవరికైతే ఆసక్తి కలిగి ఉన్నారో ఆ విద్యార్థులు నామినేషన్ వేసి పోటీ చేస్తున్నారని అన్నారు. నామినేషన్ చేసిన ప్రతి విద్యార్థి తమ యొక్క హామీలను పాఠశాల కళాశాలలో వనరులను సమర్థవంతంగా ఎలా వినియోగించుకోవాలో బోధన మరియు బోధనేతర విషయాలలో ఎలా ఉండాలో ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు. ఈ స్కూల్ ఎన్నికలలో కెప్టెన్ నలుగురు వైస్ కెప్టెన్ నలుగురు పోటీ చేశారు. వారికి తగిన చిహ్నాలను కేటాయించడం జరిగినది. రిటర్నింగ్ ఆఫీసర్ నామినేషన్ స్వీకరణ ,తిరస్కరణ చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం ప్రిసైడింగ్ ఆఫీసర్, పోలింగ్ ఆఫీసర్ , పోలింగ్ బూత్ ఏజెంట్లను, మరియు మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశారు. ఓటింగ్ వేసిన విద్యార్థులకు చూపుడువేలు పైన సిరా గుర్తును వేశారు. పాఠశాలలోని విద్యార్థులు తమ యొక్క ఓటు హక్కును వంద శాతంవినియోగించుకున్నారు. ఈ విధంగా విద్యార్థులు సక్రమంగా ఓటు వేసే విధంగా విధులు నిర్వహించారు. విద్యార్థులు ఏజెంట్లుగా ఉండి బ్యాలెట్ పత్రాలను చక్కగా జాగ్రత్త పరిచారు. ఈ పోలింగ్ లో భాగంగా త్రీ టౌన్ తాళ్ల గురజాల ఎస్సై రమేష్, ఏఎస్ఐ అలీ విచ్చేసి ఓటింగ్ సరళిని చూసి తగిన సూచనలను విద్యార్థులకు ఇచ్చారు. విద్యార్థులు ప్రజాస్వామిక పద్ధతిలో నిర్వహించిన విధానానికి ఎస్సై, ఎ ఎస్ ఐ అభినందించారు. అనంతరం ఓట్లను లెక్కించారు. దానిలో గెలిచిన కెప్టెను , వైస్ కెప్టెన్ ను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు రమేష్, పి నరేందర్, ఎ .శైలజ, ఎల్ శ్రీనివాస్, ఎస్ మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

# దొంగతనానికి వచ్చిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి



మంచిర్యాల, నేటి ప్రభాత సూర్య జూన్ 30,మంచిర్యాల పట్టణంలోని ఇస్లాంపుర ప్రాంతంలో ఆదివారం రాత్రి దొంగతనానికి ప్రయత్నించిన ఓ వ్యక్తి విషాదకరంగా మృతి చెందాడు. స్థానికులు ఆయనను గుర్తించి అరుపులు, కేకలతో స్పందించగా, దొంగ పరారయ్యే క్రమంలో విద్యుత్ తీగలకు చిక్కి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.పోలీసుల దర్యాప్తులో మృతుడు నిజామాబాద్ జిల్లా గాంధారి మండలం యాచారం గ్రామానికి చెందిన మాలోత్ రమేష్ గా గుర్తించారు. ఈ సంఘటనపై మంచిర్యాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, పూర్తి స్థాయి దర్యాప్తు ప్రారంభించారు.

# వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి: పెద్దపల్లి సత్యనారాయణ



మంచిర్యాలజిల్లా. మందమర్రి: నేటి ప్రభాత సూర్య. జూన్ 30.వికలాంగుల సమస్యలను ప్రభుత్వమే ప్రత్యక్షంగా పరిష్కరించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ ఛైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో విలేకర్లతో సమావేశమవుతూ మాట్లాడిన ఆయన, ప్రభుత్వం వికలాంగుల సమస్యల పట్ల ఉదాసీనంగావ్యవహరిస్తోందని ఆరోపించారు.వికలాంగులకు స్థానిక సంస్థలలో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయన కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో అనేకమంది వికలాంగులు నెరసిపోతున్నారని, వారి జీవితాల్లో వెలుగు నింపాలంటే ప్రభుత్వమే ముందుకు రావాలని అన్నారు.అలాగే, నెలకు ?6,000 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఇది వారి జీవనాధారంగా మారుతుందని తెలిపారు. సత్యనారాయణమాట్లాడుతూ, "బస్సులు, రైళ్లలో వికలాంగులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలి. వారి ప్రయాణాలు సురక్షితంగా ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి," అని సూచించారు.వికలాంగుల హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాటం ముమ్మరం చేస్తామని ఆయన హెచ్చరించారు. అవసరమైతే భారీ ఉద్యమాలకు కూడా సిద్ధమవుతామని తెలిపారు.

# సీపీ అంబర్ కిషోర్ ఝా కు 'ఉత్కృష్ట సేవా పతకం'



మంచిర్యాల. నేటి ప్రభాత సూర్య జూన్ 30:రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కేంద్ర ప్రభుత్వంతో అందజేసే ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు. 2009 బ్యాచ్కి చెందిన ఐపిఎస్ అధికారి అంబర్ కిషోర్ ఝా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో ఎంతోకాలంగా నిష్ఠ, సత్ఫలితాలతో పనిచేస్తున్నారు.పోలీస్ రంగంలో ఆయన నిరంతర సేవలపై కేంద్ర ప్రభుత్వం విశేషంగా స్పందించి ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలోని అధికారులు, సిబ్బంది ఆయనను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఇది పోలీస్ విభాగానికి గర్వకారణమని వారు అభిప్రాయపడ్డారు.

# విద్యార్థులు విద్యలో రాణించాలి

-ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ -

80 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ -మస్కు యాదగిరి




యాచారం నేటి ప్రభాత సూర్య (జూన్ 30):. విద్యార్థులు విద్యలో రాణించాలని ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలో తమ్మలోని గూడ ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన మస్కు యాదగిరి తన సొంత డబ్బులతో 80 మంది విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. విద్యార్థులు తల్లిదండ్రులకు బాగా చదివి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మస్కు యాదగిరి కి ప్రధాన ఉపాధ్యాయులు, బాలకృష్ణ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ అశోక్, సిపిఎం నాయకులు శీలం జంగారెడ్డి, సిహెచ్ సాహదేవ్, కే బుచ్చయ్య, కే జంగయ్య, జి శ్రీశైలం, తొట్ట బాలరాజ్, డి లింగం, టి అరుణ్ కుమార్, ఎం మహేష్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి పట్టణం లో రోడ్ల దుస్థితి పట్టించుకోని అధికారులు

- బిజెపి నాయకురాలు న్యాయవాది నల్లుల సంగీత



బెల్లంపల్లి నేటి ప్రభాత సూర్య 30:బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి ఏరియా హాస్పిటల్ నుండి, బజారు ఏరియా మార్కెట్ వరకు రోడ్లు గుంతలు పడి ప్రమాదకరంగా మారి ప్రజల వాహనాల రాకపోకలకు ఇబ్బంది మారిన ఏ అధికారులైనా ఆర్%ఉ%బి అధికారులు పట్టించుకోవడం లేదని బెల్లంపల్లి బీజేపీ నాయకురాలు న్యాయవాది నల్లుల సంగీత ఆరోపించారు.రాత్రి సమయంలో రోడ్లపై నిలిచిఉన్ననీళ్లతో గుంతలు కనపడక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఎవరికైనా టూ వీలర్ వాళ్లు బండ్లు అదుపు తప్పి పడిపోతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని, అలా అయితే వాళ్ల కుటుంబాలు రోడ్డు మీద పడతాయని అలాంటి సంఘటన జరగకముందే అధికారులు స్పందించి ఈ రోడ్ల మరమ్మత్తు చేయాలని వెంటనే అధికారులు స్పందించి రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని కోరారు, లేనిపక్షంలో ప్రజలతో ఇదే రోడ్లపై కూర్చొని ధర్నా చేస్తామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు

# బాలికల విద్యను భ్రష్టు పట్టిస్తున్న కూటమి ప్రభుత్వం



చంద్రగిరి ప్రభాత సూర్య ప్రతినిధి:వైయస్ఆర్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఓబుల్ రెడ్డి.గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు ఉన్నత విద్య అందకుండ వ్యూహాత్మక కుట్ర చేస్తున్నారు ఇందులో భాగంగా హైస్కూల్ ప్లేస్ (ఇంటర్ కాలేజీ విద్య)కు ఏసరు పెట్టిన కూటమి ప్రభుత్వం విటిలో పని చేస్తున్న దాదాపు 1000 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలి తిరిగి ఆయా ఖాళీలను అడ్మిషన్ల అనంతరం కూడా భర్తీ చేయాలని విద్యాశాఖ పాఠాలు చెప్పే వారు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పలితంగా పిల్లలంతా ప్రైవేట్ కార్పొరేట్ కాలేజిలకు వెళ్లేలా స్కెచ్ గత వైయస్ జగన్ ప్రభుత్వంలో మండలానికి ఓక హైస్కూల్ ప్లస్ ఏర్పాటు మండలానికి రెండు జూనియర్ కాలేజీలు ఉండాలి అనే ఉద్దేశంతో 2022 లో రెండు విడతలో 504 హైస్కూల్ ప్లస్లను ఏర్పాటు చేశారు అయితే వైయస్ జగన్ పై అక్కసుతో నాటి ప్రభుత్వంలోని విద్యా సంస్కరణలను ఒక్కకటిగా రద్దు చేస్తుంన్నారు అని విమర్శించారు..చంద్రగిరి నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు చెంగల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందనడానికి ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ ఈసెట్ రిజల్ట్స్ వచ్చి దాదాపు 45 రోజులు అవుతున్నా ఇప్పటికీ కౌన్సిలింగ్ ప్రారంభం కాలేదు మరోవైపు ఈరోజు నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు క్లాసులు ప్రారంభం అవుతున్నాయి ఇంజినీరింగ్ రెండో ఏడాదిలో అడ్మిషన్లకోసం 34వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ పరీక్షలు రాస్తే అందులో 31,922 మంది ఉత్తీర్ణత సాధించారు గతనెల మే 15న ఫలితాలు వెలువడినా ఇప్పటికీ కౌన్సెలింగ్ ప్రక్రియపై షెడ్యూల్ విడుదలచేయకపోవడం ఆ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడం విద్యావ్యవస్థలో నెలకొన్న దారుణ పరిస్థితులకు మరో నిదర్శనం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారికి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయడం మీద ఉన్న శ్రద్ధ విద్యాశాఖ పైన ఉండాలి అని నారా లోకేష్ గారిని డిమాండ్ చేస్తున్నము. ఈ కార్యాక్రమం లో వైయస్ఆర్ విద్యార్థి , యువజన సంఘాల నాయకులు యశ్వత్ రెడ్డి,హరీష్,సాయిరాయల్,శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలి..

# కేశంపేట్ వ్యవసాయ అధికారి శిరీష..



షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూన్ 30):డిజిటల్ పట్టా పాస్ బుక్ కలిగిన ప్రతీ రైతు కూడా ఫార్మర్ రిజిస్ట్రీలోపేరు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శిరీష తెలిపారు. కేశంపేట్ మండల పరిధిలోని వేముల్ నర్వ గ్రామంలో సోమవారం, ఫార్మా రిజిస్ట్రేషన్ చేసే విధానంలో పాల్గొని.. వ్యవసాయ అధికారి శిరీష పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మండలం లోని పాపిరెడ్డిగూడెం, పోమాలపల్లి, దత్తాయపల్లి, ఇప్పలపల్లి సెక్టార్ లో నమోదు కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయ సెక్టార్ అధికారి ఏఈఓ రాజేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామంలో సోమవారం, రైతులకు ఫార్మా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. వారు మాట్లాడుతూ.. ఫార్మర్ రిజిస్టర్ పోర్టల్ ద్వారా రైతులకు సీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ, వివిధ రకాల సబ్సిడీలు పంట బీమా కనీస మద్దతు ధరలు వ్యవసాయ రుణాలు వ్యవసాయ పరికరాలపై సబ్సిడీ వంటి



ప్రభుత్వ పథకాలు పొందవచ్చు అని అన్నారు. రిజిస్ట్రేషన్ కు కావలసిన పత్రాలు ఆధార్ కార్డు నెంబర్ ఆధార్ కు లింకు అయిన మొబైల్ నెంబర్ భూమి పట్టాదారు పాసుబుక్ వివరాలు తెలియపరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాలికల విద్యను భ్రష్టు పట్టిస్తున్న కూటమి ప్రభుత్వం

### చంద్రగిరి ప్రభాత సూర్య ప్రతినిధి

### వైయస్ఆర్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఓబుల్ రెడ్డి



నేటి ప్రభాత సూర్య గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు ఉన్నత విద్య అందకుండ వ్యూహాత్మక కుట్ర చేస్తున్నారు ఇందులో భాగంగా హైస్కూల్ ప్లేస్ (ఇంటర్ కాలేజీ విద్య)కు ఏసరు పెట్టిన కూటమి ప్రభుత్వం విటిలో పని చేస్తున్న దాదాపు 1000 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలి తిరిగి ఆయా ఖాళీలను అడ్మిషన్ల అనంతరం కూడా భర్తీ చేయాలని విద్యాశాఖ పాఠాలు చెప్పే వారు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పలితంగా పిల్లలంతా ప్రైవేట్ కార్పొరేట్ కాలేజిలకు వెళ్లేలా స్కెచ్ గత వైయస్ జగన్ ప్రభుత్వంలో మండలానికి ఓక హైస్కూల్ ప్లస్ ఏర్పాటు మండలానికి రెండు జూనియర్ కాలేజీలు ఉండాలి అనే ఉద్దేశంతో 2022 లో రెండు విడతలో 504 హైస్కూల్ ప్లస్లను ఏర్పాటు చేశారు అయితే వైయస్ జగన్ పై అక్కసుతో నాటి ప్రభుత్వంలోని విద్యా సంస్కరణలను ఒక్కకటిగా రద్దు చేస్తుంన్నారు అని విమర్శించారు..చంద్రగిరి నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు చెంగల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందనడానికి ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ ఈసెట్ రిజల్ట్స్ వచ్చి దాదాపు 45 రోజులు అవుతున్నా ఇప్పటికీ కౌన్సిలింగ్ ప్రారంభం కాలేదు మరోవైపు ఈరోజు నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు క్లాసులు ప్రారంభం అవుతున్నాయి ఇంజినీరింగ్ రెండో ఏడాదిలో అడ్మిషన్లకోసం 34వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ పరీక్షలు రాస్తే అందులో 31,922 మంది ఉత్తీర్ణత సాధించారు గతనెల మే 15న ఫలితాలు వెలువడినా ఇప్పటికీ కౌన్సెలింగ్ ప్రక్రియపై షెడ్యూల్ విడుదలచేయకపోవడం ఆ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడం విద్యావ్యవస్థలో నెలకొన్న దారుణ పరిస్థితులకు మరో నిదర్శనం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారికి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయడం మీద ఉన్న శ్రద్ధ విద్యాశాఖ పైన ఉండాలి అని నారా లోకేష్ గారిని డిమాండ్ చేస్తున్నము. ఈ కార్యాక్రమం లో వైయస్ఆర్ విద్యార్థి , యువజన సంఘాల నాయకులు యశ్వత్ రెడ్డి,హరీష్,సాయిరాయల్,శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పార్టీకంటే ఎక్కువ ఎవరూ కాదు.. రాజా సింగ్ విషయంలో బీజేపీ కీలక ప్రకటన..!




**హైదరాబాద్, :** బీజేపీ పార్టీ ఎమ్మెల్యే రాజా సింగ్ విషయంలో తెలంగాణ బీజేపీ పార్టీ కీలక ప్రకటన చేసింది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ క్రమశిక్షణారాహిత్యం పరాకాష్ఠకు చేరిందని, రాష్ట్ర పార్టీ అధ్యక్ష ఎన్నికలలో రాజాసింగ్ కూడా నామినేషన్ వేస్తానని పార్టీ కార్యాలయానికి వచ్చారని తెలిపింది. ఆ సమయంలో విషయమై జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ అభయ్ పాటిల్ రాజాసింగ్ చర్చించారు. ఇక రాజాసింగ్ కోరిక మేరకు నామినేషన్ పత్రాలు ఇచ్చి నామినేషన్ వేసుకునే అవకాశం ఇచ్చారని తెలిపింది. అలాగే రాష్ట్ర ఎన్నికల అధికార శోభా కరంద్లాజేకి 10 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల మద్దతుతో నామినేషన్ ఫామ్ సమర్పించవలిసి ఉండగా, వారు కేవలం ముగ్గురు సభ్యుల సంతకాలతో ఉన్న ఫామ్ మాత్రమే సమర్పించినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధన ప్రకారం.. రాష్ట్ర అధ్యక్షుని ఎన్నికలలో పోటీ చేయడానికి 10 మంది స్టేట్ కౌన్సిల్ సభ్యుల సంతకాలతో మరో ఫామ్ సమర్పించవలిసిందిగా శ్రీమతి శోభా కరంద్లాజే రాజాసింగ్ కోరారు. అయితే, రాజాసింగ్ నామినేషన్ కి మద్దతిచ్చే స్టేట్ కౌన్సిల్ సభ్యులు లేక చేతులెత్తేసి పార్టీ పోటీ చేయనివ్వట్లేదని అబద్ధాలతో పార్టీపై అభాండాలు వేస్తున్నట్లు తెలిపింది. పార్టీ అధ్యక్షులు శ్రీ కిషన్ రెడ్డికి సమర్పించిన రాజీనామా పత్రాన్ని ఆయన జాతీయ అధ్యక్షుడికి పంపించడం జరుగుతుందని తెలిపింది. రాజాసింగ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనుకుంటే స్పీకర్ కు రాజీనామా లేఖ సమర్పించాలని, పార్టీకంటే ఎక్కువ ఎవరూ కాదని బీజేపీ పార్టీ పేర్కొంది. గతంలో కూడా ఇలాంటి క్రమశిక్షణారాహిత్య వ్యవహారాలతో సస్పెండ్ అయితే మళ్లీ పార్టీలోకి తీసుకున్నామని.. ప్రధానమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు వారి నియోజకవర్గానికి వచ్చినా సరే వారి కార్యక్రమాలకు హాజరుకాకుండా పార్టీ కంటే తానే సుప్రీం అన్నట్లుగా ఉంది రాజాసింగ్ వ్యవహారమని పార్టీ తెలిపింది. మా పార్టీకి వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యం. పార్టీ క్రమశిక్షణను అనేకసార్లు రాజాసింగ్ ఉల్లంఘించినట్లు తెలిపింది. చివరకు ఈరోజు వారే రాజీనామా చేసారని పార్టీ ప్రకటించింది.

## లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం.. మరో ఇద్దరి అరెస్ట్..!



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్‌లో పొలిటికల్ హీట్ పెంచుతున్న ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఈ రోజు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి..ఈ కేసులో నిందితులుగా ఉన్న బాలాజీ, నవీన్‌లను అదుపులోకి తీసుకున్నారు సిట్ పోలీసులు.. ఎన్నికల సమయంలో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కి రూ.8.20 కోట్ల రూపాయలు తరలించినట్టు బాలాజీపై ఆరోపణలు ఉండగా.. ఇండోర్ లో బాలాజీని అదుపులోకి తీసుకున్నారు సిట్ పోలీసులు.. బాలాజీ లొకేషన్ ఆధారంగా ఇండోర్ వెళ్లిన సిట్ బృందం.. అతడిని పట్టుకుంది.. ఇక బాలాజీతో పాటు నవీన్‌ను కూడా అదుపులోకి తీసుకుంది.. ఆ ఇద్దరు నిందితులను ఇండోర్ నుంచి విజయవాడ తరలిస్తున్నారు సిట్ అధికారులు.. కాగా, లిక్కర్ కేసులో సిట్ అధికారులు దూకుడు చూపిస్తున్నారు.. ఇతర రాష్ట్రాలతో పాటు.. ఇతర దేశాల్లో ఉన్నవారిని కూడా అరెస్ట్ చేయడంపై దృష్టి సారించారు.. ఇప్పటికే అరెస్ట్ అయిన నిందితులు ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా.. విదేశాల్లో ఉన్న లింక్ లపై కూడా ఫోకస్ పెట్టారు సిట్ అధికారులు.. మరోవైపు, తాజాగా అరెస్ట్ అయిన నిందితులను మరింత లోతుగా ప్రశ్నించేందుకు సిట్ అధికారులు ప్రయత్నిస్తున్నారు.. దీని కోసం కోర్టుల అనుమతి తీసుకుంటున్నారు..

## కర్ణాటకలో సీఎం మార్పు పుకార్లు.. ఖర్గే సంచలన వ్యాఖ్యలు..!



**న్యూఢిల్లీ,:** కర్ణాటక ప్రభుత్వంలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై పార్టీ హైకమాండ్‌కు చర్య తీసుకునే అధికారం ఉందని స్పష్టం చేశారు. అక్టోబర్‌లో ముఖ్యమంత్రి మార్పుపై రాష్ట్రంలో ఊహాగానాలు పెరుగుతున్నాయి. ఈ అంశాన్ని తాజాగా మీడియా ప్రతినిధులు ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి మార్పు నిర్ణయం పార్టీ హైకమాండ్ చేతిలో ఉంది. హైకమాండ్‌లో ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. ఈ నిర్ణయాన్ని హైకమాండ్‌కే వదిలేయాలి. కానీ ఎవరూ అనవసరంగా సమస్యలు సృష్టించడానికి ప్రతయత్నించకూడదు." అని ఖర్గే వ్యాఖ్యానించారు. కర్ణాటక ప్రభుత్వంలో నాయకత్వ మార్పు జరుగుతుందనే ఊహాగానాల మధ్య. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన "హైకమాండ్" వ్యాఖ్యపై బీజేపీ వ్యాంగంగా స్పందించింది. ఖర్గే కాకపోతే "పార్టీ హైకమాండ్" ఎవరు అని యంగ్ ఎంపీ తేజస్వీ సూర్య ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు చాలా వింతగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో ఓ పోస్ట్ చేశారు. "కాంగ్రెస్ హైకమాండ్ రూపురేఖలు లేనిది. అది ఎవరికీ కనిపించదు, వినిపించదు. కానీ అది ఉన్నట్లు అందరూ అనుభూతి చెందుతారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ అధిష్ఠానం అని ప్రజలు భావిస్తున్న పార్టీ అధ్యక్షుడు కూడా అది తాను కానని అంటున్నారు" అని రాసుకొచ్చారు. కాగా.. ఇప్పటికే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనకు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కు మధ్య విభేదాలు ఉన్నాయనే పుకార్లను తోసిపుచ్చారు. " డీకే శివకుమార్, నేను కలిసే ఉన్నాం. ఈ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు శిలలాగా చెక్కుచెదరకుండా ఉంటుంది. బీజేపీ అబద్ధాలకు పేరుగాంచింది. వాళ్లు చేసే వ్యాఖ్యలపై మేము స్పందించము." అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు.

## పాశమైలారం ఘటనపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, :** పటాన్‌చెరు సమీపంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో సోమవారం ఉదయం జరిగిన భారీ పేలుడు ఘటన రాష్ట్రాన్ని షాక్‌కు గురిచేసింది. ఈ ఘోర ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంటల ధాటికి పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం విచారం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అధికారికంగా చేసిన ప్రకటనలో.."పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనలో పలువురు మరణించడం కలచివేసింది. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఆదేశాలు సంబంధిత అధికారులకు ఇచ్చాను. ప్రభుత్వంగా మేము బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం" అని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం తగిన విధంగా ఆదుకుంటుందని, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. పాశమైలారం ఘటనపై అధికారులు సంపూర్ణ నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 10 మంది మృతి చెందగా, మరెందరో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పరిశ్రమ పూర్తిగా ధ్వంసమైన స్థితిలో ఉండగా, రెస్క్యూ చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.

# నానాకాలం చదువులు



'వానాకాలం చదువు'లంటారు. ఇప్పటికీ దేశంలో చాలాచోట్ల వానకీ, చదువుకీ చుక్కెదురే. చెట్ల కిందో, అరుగుల మీదో, అంతంతమాత్రపు కప్పు కిందో బడులు నడిపేటప్పుడుబీ చక్కా నడిచి పోడానికి పక్కారోడ్లు లేనప్పుడు వానాకాలంలో చదువుకు గంట కొట్టి ఇంటికి పరిమితమవక తప్పదు. వెనకటి కాలంలో చదువు చెప్పే రోజులతో సమానంగా నిషేధించే రోజులూ ఉండేవి. అష్టమి, నవమి, చతుర్దశి, అమావాస్య, పౌర్ణమి మొదలైన తిథుల్లో, గ్రహణం పట్టినప్పుడూ అధ్యయనం కూడదు. వాటిని 'అనధ్యయన దినా'లనేవారు. వేదాలు, ఇతర రహస్య విద్యల వల్లింపైతే వర్షాకాలంలో పూర్తిగా నిషిద్ధం. నేర్చుకున్నది మాత్రం నెమరు వేసుకోవచ్చు. క్రమంగా కేలండర్ మారిపోయి వర్షర్తువూ, చదువుల ఋతువూ ఒకేసారి మొదలవడం ప్రారంభించాయి. మినహాయింపులున్నా ఆ రెంటి మధ్యా వైరుధ్యం పోయి సయోధ్య వెల్లివిరుస్తోంది. వానలతో పచ్చదనాన్ని తెచ్చుకుని కొత్త ఉత్సాహాన్ని నింపుకొనే ప్రకృతితో చదువుల ఋతువు పోటీపడుతూ రహదారులనూ, బడితావులనూ పిల్లల సందడితో వర్ణరంజితమూ, కర్ణరంజితమూ చేస్తోంది. మరోపక్క విచిత్రంగా ముల్లు ఈ కొస నుంచి పూర్తిగా దాని వ్యతిరేక దిశకు తిరగడమూ జరుగుతోంది. చదువుల అభావ దినాలు పోయి ఉల్బణ దినాలు వచ్చాయి. ఋతు నిర్బంధాలూ, తిథివార నిషేధాలూ పోయి చదువుల కేలండర్ 'సార్వకాలికత'ను తెచ్చుకుంటోంది. వానా కాలం చదువులు పోయి నానాకాలం చదువులొచ్చాయి. అది మరోరకం వైపరీత్యానికి దారి తీసింది. అంతటా కాకపోయినా, అనేక ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో వేసవి సెలవులు కుదించుకుపోతున్నాయి. ప్రత్యేకించి పబ్లిక్ పరీక్షలు రాయబోయే పిల్లలకు వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ పైన వేసవి పొడవునా ట్యూషన్ తరగతులకు హాజరవడం అనివార్యమవుతోంది. భుజాలను వంచే పుస్తకాల బరువుకు తోడు మస్తకాలను భయాందోళనలతో నింపే చదువు బరువూ పెరిగిపోతోంది. 'స్కూలు వర్కు'ను మించి 'హోము వర్కు' నివ్వడంతో బడికీ, ఇంటికీ తేడా చెరిగిపోయి, వేరే వృత్తి ఉద్యోగాల్లో తలమునకలయ్యే తల్లితండ్రులే టీచర్లు గానూ మారి, అదనపు భారాన్ని మోయాల్సి వస్తోంది. తల్లుల పరిస్థితి మరీ ఘోరం. ఉద్యోగానికి అదనంగా వంటపనీ, ఇంటిపనీ, పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూనే ఉపాధ్యాయిని పాత్రనూ పోషించవలసి వస్తోంది. స్త్రీ, పురుష బాధ్యతల మధ్య అసమానతలు కొనసాగుతున్న పరిస్థితిలో గృహిణికి ఇదెంత భారమో ఊహించగలం. స్కూలు ఫీజులూ, ఇతరత్రా వసూళ్ల రూపంలో వేలు, లక్షలు ధారపోస్తున్నా తల్లితండ్రులకు 'టీచరీ' రూపంలో ఈ అదనపు చాకిరీ తప్పడం లేదు. ఆటపాటలతో సహా ఇతరేతర మానసికోల్లాసాలకు ఒకటి, రెండు గంటలైనా ఒత్తిడి లేని స్వేచ్ఛా సమయం చిక్కని పిల్లల పాలిట చదువు అక్షరాలా 'నిర్బంధ' విద్యే అవుతోంది. విద్యాసంస్థలు చదువు బరువు తగ్గించకుండానే అదనపు వేళల్లో ఆటపాటల బరువునూ మోపడంతో పిల్లలకసలే ఊపిరి సలపడం లేదు. దేశంలో విద్యాబోధన ఎంత శాస్త్రీయంగా జరుగుతోందో పట్టించుకునే వ్యవస్థ అసలేదైనా ఉందా, చదువులు పిల్లల శారీరక మానసిక వికాసానికేమైనా సాయపడు తున్నాయా అన్న ప్రశ్నలు తల్లితండ్రుల నుంచే ఎదురవుతున్నాయి. పరీక్షలలో సాధించాల్సిన మార్కుల గరిష్ఠ శాతం కూడా ఇప్పుడు మారిపోయింది. తదుపరి చదువుకు ఏ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలోనైనా సీటు రావడానికి డెబ్బై, ఎనభై శాతం మార్కులు కూడా సరిపోవడం లేదు, తొంభై శాతం దాటి తీరాల్సిందే. దాంతో పిల్లల్లో పోటీ, అసూయ, అలజడి, ఆందోళన, ఒత్తిడి పెరిగి పోతున్నాయి. తమ చదువూ, భవిష్యత్తుల గురించి తల్లితండ్రులు కనే కలల భారం పిల్లల కను రెప్పల మీద పడి వాళ్ళ నిద్రను హరిస్తోంది. పిల్లల్లో గ్రహణశక్తి, చురుకుదనం పెరిగిన మాట నిజమే కానీ, మొత్తంగా నేటి ఈ చదువుల తీరు ఆదర్శవంతమేనా అన్న సందేహం మాత్రం వదలకుండా వేధిస్తూనే ఉంది. ఇక చదువుల్లో రకరకాల అసమానతలు పెరగడమే తప్ప తగ్గుతున్న జాడలేదు. ఉజ్జ్వల భవిష్యత్తు వైపు నడిపించే చదువుల నిచ్చెనపై చివరి మెట్ల మీద చతికిల బడుతున్నవారు నేటికీ అసంఖ్యాకమే. ఇంకోవైపు నూటికి నూరుశాతం అక్షరాస్యతను సాధించడానికి ప్రభుత్వాలు ఇప్పటికీ ఆపసోపాలు పడుతూనే ఉన్నాయి. నూటయాభయ్యేళ్ళ క్రితం, బ్రిటిష్ వలస పాలన ప్రారంభం నాటికి మూడు శాతం పైచిలుకు ఉన్న అక్షరాస్యత ఇప్పుడు ఎనభై శాతానికి చేరడం, విడిగా చూసినప్పుడు ఒకింత ఊరటే కానీ, ఎన్నో దేశాలతో పోల్చితే ఈ పెరుగుదల వేగమూ, శాతమూ ఏమంత విశేషం కావని పెదవి విరిచేవారూ ఉన్నారు. ఇందులో మళ్ళీ ప్రాంతీయంగా, జెండర్ పరంగా అంతరాలూ యథాతథం. ఎప్పుడో కానీ సోదిలోకి రాని ఈశాన్య రాష్ట్రాలు అక్షరాస్యతలో అగ్రస్థానంలో ఉండటం ఒక విశేష మైతే, ఎంత ప్రామాణికమో తెలియదు కాని, బిహార్‌తో కలసి ఆంధ్రప్రదేశ్ ఆ పట్టికలో అడుగు బొడుగు స్థానాలలో కనిపించడం కలవరపరిచే విషయం. ఇక చదువుల నాణ్యత విషయానికొస్తే, పట్టికలో మన దేశం స్థానం ఉసూరుమనిపించే మరో అధ్యాయం. చదువుకీ, మంచి రాబడిగల ఉద్యోగాలకూ పీటముడి పడిన దశలో విద్యాభ్యాసం పూర్తిగా పరుగు పందెంగా మారి పిల్లల్ని విపరీత శ్రమకూ, అలసటకూ గురిచేస్తున్న మాట నిజం. చదువుల మరో పరమార్థమైన జ్ఞాన సముపార్జనకు కూడా పెద్ద పీట వేస్తూ ఎప్పటికది నిలకడ తెచ్చుకుంటుందో, పిల్లల్ని పరీక్షల భయతీరాన్ని దాటించి వైజ్ఞానికపు వెలుగుల ఉల్లాస తీరం వైపు నడిపిస్తుందో కాలమే తేల్చాలి.

## విదేశీ విశ్వవిద్యాలయాలతో విద్యకు ముప్పు?



ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఐదు విశ్వవిద్యాలయాలు జాతీయ విద్యావిధానం 2020కి అనుగుణంగా, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలు 2023 ప్రకారం భారతదేశంలో క్యాంపస్‌లను స్థాపించడానికి సిద్ధమవుతున్నందున, భారతీయ ఉన్నత విద్యలో పరివర్తనాత్మక మార్పు జరుగుతోంది. ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూనివర్శిటీ ఆఫ్ లివర్‌పూల్, విక్టోరియా యూనివర్శిటీ, వెస్ట్రన్ సిడ్నీ యూనివర్శిటీ, ఇన్‌స్టిట్యూట్ యూరోపియో డి డిజైన్ (ఇటలీ) 2026- 2027 మధ్య కార్యకలాపాలను ప్రారంభించనున్నారు.యుజిసి ఆమోదం పొందిన మొదటి విదేశీ విశ్వవిద్యాలయంగా 2025 ఆగస్టులో గురుగ్రామ్ క్యాంపస్‌ను ప్రారంభించనున్నది సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం. ఈ విదేశీ క్యాంపస్‌లు భారతదేశ విద్యారంగాన్ని మెరుగుపరుస్తాయా లేదా దాని ఉన్నత విద్యా వ్యవస్థకు ముప్పు కలిగిస్తాయా అని మేధావుల్లో చర్చకు దారితీసింది. భారతీయ విద్యార్థులకు విదేశీ విశ్వవిద్యాలయాల రాక గణనీయమైన ప్రయోజనాలను హామీ ఇస్తున్నది. అగ్రశ్రేణి సంస్థలు అధిక -నాణ్యతగల పాఠ్యాంశాలు, ప్రపంచ బోధనా పద్ధతులు, పరిశోధన అవకాశాలను అందించగలవు. భారత దేశంలో ప్రపంచస్థాయి ఉన్నతవిద్యాసంస్థల కొరతను పరిష్కరిస్తాయి. ప్రస్తుతం ఐఐటిలు, ఐఐఎంలు వంటి ఉన్నత సంస్థలు మాత్రమే ప్రపంచవ్యాప్తంగా పోటీపడుతున్నాయి. విద్యార్థులు విదేశాలలో చదువుకోవడం కంటే తక్కువ ఖర్చుతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన డిగ్రీలను పొందగలుగుతారు. ఆర్థిక భారాన్ని తగ్గిస్తారు, 2022లో 6,50,000 మంది భారతీయ విద్యార్థులు విదేశాలలో చదువుతున్నందున రూ. 1.3 లక్షల కోట్ల వార్షిక ప్రవాహాన్ని నివారిస్తారు. ఈ క్యాంపస్‌లు 2022లో దాదాపు 1 మిలియన్ భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నందున మేధోవలస కూడా అరికట్టగలవు. 2024 నాటికి 80 బిలియన్ల డాలర్లకు చేరుకుంటాయని అంచనా వేయబడిన ఆర్థిక వనరులను నిలుపుకోగలవు. ఐఐటి ఢిల్లీ క్వీన్స్‌ల్యాండ్ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం వంటి సహకార కార్యక్రమాలు ఆవిష్కరణను ప్రోత్సహిస్తాయని భావిస్తున్నారు. గుజరాత్‌లోని జిఐఎఫ్‌టి సిటీ వంటి కేంద్రాలు పన్ను మినహాయింపులు అందిస్తూ డీకిన్ విశ్వవిద్యాలయం వంటి సంస్థలు ఆకర్షిస్తున్నాయి. అంతేకాకుండా, విదేశీ విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ అధ్యాపకులు, పరిశ్రమ-సమలేఖన కార్యక్రమాలను అందించడం ద్వారా, ప్రపంచ మార్కెట్లకు విద్యార్థులను సిద్ధం చేయడం ద్వారా ఉపాధిని పెంచుతాయి. ఇంటి నుండి బయటకు వెళ్లకుండా ప్రపంచస్థాయి విద్యను కోరుకునే భారతీయ విద్యార్థులకు ఇది గేమ్- ఛేంజర్. అయితే, విద్య పరిరక్షణ నేతలు, విమర్శకులు సంభావ్య ప్రమాదాల గురించి హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు రూ. 10,000, రూ. 50,000తో పోలిస్తే సంవత్సరానికి రూ. 10 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు అంచనా వేయబడిన అధిక ట్యూషన్ ఫీజులు సంపన్న విద్యార్థులకు ప్రాప్యతను పరిమితం చేస్తాయి, ప్రాథమిక, ఉన్నత విద్యను పొందేందుకు చాలా మంది కష్టపడుతున్న దేశంలో అసమానతలను తీవ్రతరం చేస్తాయి. స్కాలర్ షిప్‌లు లేదా నిశ్చయాత్మక చర్యలు లేకుండా వరుసగా 25.9%, 21.2% నమోదు రేట్లు కలిగిన షెడ్యూల్డ్ కులాలు, తెగలు వంటి అట్టడుగు వర్గాలు ఉన్నత విద్యకు దూరమవుతారు. భారతదేశంలోని విదేశీ క్యాంపస్‌లు దేశీయంగా ప్రతిభను, అలాగే వనరులను నిలుపుకునే సామర్థ్యాన్ని నొక్కి చెబుతున్నాయి. అయితే, భారతదేశంలో 40 మిలియన్ల ఉన్నత విద్య విద్యార్థులు కొంత భాగాన్ని మాత్రమే అందించే వాటి పరిమితి స్థాయి వాటి ప్రభావాన్ని పరిమితం చేయవచ్చు. భారతదేశంలో విదేశీ విశ్వవిద్యాలయాల విజయం వ్యూహాత్మక నియంత్రణపై ఆధారపడి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. నష్టాలను తగ్గించడానికి, ప్రభుత్వం అవసరాల ఆధారిత స్కాలర్‌షిప్‌లను అమలు చేయాలి. పెరిగిన నిధులతో ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయాలి. ఉన్నత స్థాయి విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. విద్యా అంతరాలను పరిష్కరించడం కూడా చాలా కీలకం. విదేశీ విశ్వవిద్యాలయాల ప్రవేశం అంతర్గతంగా ముప్పు కాదు కానీ జాగ్రత్తగా పర్యవేక్షణ అవసరం. సరైన విధానాలతో ఇది భారతీయ ఉన్నత విద్యను ప్రపంచ కేంద్రంగా మార్చగలదు. భారతదేశం ఈ విద్యాపరమైన కూడలిలో ఉన్నందున, రాబోయే సంవత్సరాలు భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

## అటు రణదాహం.. ఇటు నోబెల్ మోహం



నోబెల్ శాంతి బహుమతిని ఎలాగైనా పొందాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉవ్విళ్లూరుతున్నారు. పదవిలోకి రాక ముందు ఎన్నికల ప్రచారంలో తాను అధికారంలోకి వచ్చిన 24 గంటల్లోనే ఉక్రెయిన్ రష్యా మధ్య యుద్ధాన్ని ఆపుతానని హామీ ఇచ్చిన ఆయన అధికార పగ్గాలు పట్టిన తరువాత ఏమీ చేయలేకపోయారు. పైగా కొన్ని దేశాల వైపు మద్దతుగా నిలిచి యుద్ధాలను మరింత ప్రేరేపించడమే కాదు ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగడం వివాదాలకు దారి తీస్తోంది. దీనికి ఉదాహరణ ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధమే. నోబెల్ బహుమతికి అర్హతలను పరిశీలిస్తే దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాలు చేయడం, సాయుధ దళాలను తక్కువగా వినియోగించడం, శాంతి కోసం అంకిత భావంతో కృషి చేయడం తదితర లక్షాలను సాధించిన వారికే నోబెల్ శాంతి బహుమతి పొందడానికి అర్హత ఉంటుందని నోబెల్ బహుమతి సంస్థాపకులు ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో స్పష్టం చేశారు. దీన్ని బట్టి ట్రంప్‌కు ఆ అర్హత ఉందా అన్నది ప్రశ్నార్థకం. డొనాల్డ్ ట్రంప్ శాంతి కాముకుడు కాదు. పదవిలో లేనప్పుడు ఆయన యుద్ధాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తానే అధ్యక్షుడిగా ఉంటే ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమయ్యేది కాదని బీరాలు పలికారు. అమెరికా శాశ్వత యుద్ధాలకు అమెరికాలోని ప్రపంచవాదుల వైఖరిని ట్రంప్ సిద్ధాంతం తప్పుపట్టింది. అమెరికా ఇరాన్ చర్చల్లో ఉంటుండగా ట్రంప్ నిఘా వ్యవస్థ, శ్వేతభవనం అత్యంత సన్నిహితుడు ఇజ్రాయెల్ నాయకత్వం కలిసి జూన్ 13న ఇరాన్‌పై దాడులను ప్రారంభించాయి. మొట్టమొదట ట్రంప్, సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో వీరిద్దరూ ఈ యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకోదని ప్రకటించారు. పశ్చిమాసియాలో అమెరికా సైనికులపై కానీ, అమెరికా స్థావరాలపై కానీ లక్ష్యంగా చేసుకుని దాడులు చేయకూడదని ఇరాన్‌ను హెచ్చరించారు. ఆ ప్రకారం ఇరాన్ ఏమీ చేయలేదు. కానీ టెహ్రాన్ టార్గెట్ నేరుగా ఇజ్రాయెల్ పైనే. ఇరాన్ క్షిపణుల పైన ఇజ్రాయెల్ దాడులు చేయడం, అమెరికా బి 2 బాంబర్లు బంకర్లను ధ్వంసం చేసే బాంబులను ఫర్డోపై ప్రయోగించడం, అమెరికా సబ్‌మెరైన్లు నతాంజ్, ఇస్ఫహన్ న్యూక్లియర్ ప్లాంట్లపై దాడులు చేయడం ఇవన్నీ జరిగాయి. ఇదంతా నిస్సందేహంగా ట్రంప్ ప్రారంభించిన యుద్ధమే. అమెరికాలో, పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పుతానన్న హామీతో ట్రంప్ అధికారంలోకి వచ్చారు. కానీ ఆరు నెలల్లోనే యుద్ధోన్మాదిగా మారారు. ప్రపంచవాద దురాక్రమణ దారుడుగా పెరిగారు. యుద్ధాల విషయానికి వస్తే అమెరికా తాను చేసిన ఘోరమైన పొరపాట్లు ఏమిటో అంతగా తెలుసుకోవడం లేదు. 2001లో అల్‌ఖైదా ఉగ్రవాదిని అంతం చేస్తామని చెప్పి అఫ్గానిస్థాన్‌పై దండెత్తింది. తాలిబన్‌ను ఓడించి, ఆ దేశాన్ని 'ప్రజాస్వామ్యం' చేసింది. కానీ ఇరవై ఏళ్ల తరువాత మళ్లీ తాలిబన్‌కే అఫ్గానిస్థాన్‌ను అప్పగించింది. 2003 లో బాగ్దాద్‌లో నరమేథాన్ని కోరుకునే ఆయుధాలు ఉన్నాయన్న సాకుతో ఇరాక్‌పై దాడులు చేసి సర్వం నాశనం చేసింది. లిబియా ప్రభుత్వం నుంచి లిబియన్లను రక్షిస్తున్నామని అబద్ధం చెప్పి 2011లో లిబియాపై దండెత్తింది. ఇక ఇరాన్ విషయంలో అమెరికా నిఘా సంస్థలు మార్చిలో ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమం చేపట్టడం లేదని నిర్ధారించాయి. గతంలో అణుకార్యక్రమంపై అమెరికా తదితర పాశ్చాత్య దేశాలతో ఒప్పందంలో సంతకం చేసినప్పుడు అణుకార్యక్రమాలపై ఇరాన్‌లో పరిశీలించడానికి ఇరాన్ ఒప్పుకుంది. కానీ ఆ ఒప్పందాన్ని ట్రంప్ రద్దు చేసేశారు. ఇరాన్ మళ్లీ అమెరికాతో చర్చలకు సమాయత్తమైంది. కానీ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ సమయంలో దౌత్యాన్ని చెడగొట్టాడు. పశ్చిమాసియా సుస్థిరతపై, ప్రపంచ దేశాల మనుగడపై ఈ యుద్ధం తీవ్ర పరిణామాలు చూపిస్తోంది. ఉత్తర కొరియా తన అణ్వాయుధాలను ఏనాటికీ వదులుకోదు. ఇరాన్ పాలక వర్గం ఈ సంక్షోభంలో నిలబడగలిగితే అణు కార్యక్రమాన్ని మళ్లీ చేపడుతుంది. నెతన్యాహు అదుపు లేని సైనికవాదం తన స్వదేశంలో అధికారంపై పట్టు నిలుపుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఓ భాగం. ఇది పశ్చిమాసియా ప్రాంతాన్ని తీవ్ర భద్రతా అగాధంలో పడేసింది. ఇజ్రాయెల్ యుద్ధాన్ని అమెరిక యుద్ధంగా ట్రంప్ మార్చేసి ఘోర విపత్తుగా అధ్వాన పరిస్థితిలోకి నెట్టేశారు. అయినా శాంతి దూతగా నోబెల్ బహుమతిని పొందాలని ఆకాంక్షించడం రొయ్యల మొలతాడు కట్టుకున్న పిల్లి రుద్రాక్షమాలలు ధరించిన సామెత గుర్తుకు వస్తుంది. అమెరికా పాలక వర్గం తాజాగా ఆయన పేరును నోబెల్ బహుమతికి ప్రతిపాదించింది. అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు బడ్డీకార్టర్ ఈ బహుమతికి ట్రంప్ పేరును ప్రతిపాదిస్తూ నార్వేలోని నోబెల్ కమిటీకి లేఖను రాశారు. ఉక్రెయిన్‌కు చెందిన చట్టసభ సభ్యుడు ఒలెక్సాండర్ మెరెఝూకో కూడా ట్రంప్ పేరును నోబెల్‌కు ప్రతిపాదించారు. కానీ రష్యాఉక్రెయిన్ మధ్య ఇంకా దాడులు కొనసాగుతుండడంతో యుద్ధం ఆపడంలో ట్రంప్ విఫలమయ్యారని ఆ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. పాకిస్థాన్ ప్రభుత్వం నోబెల్ బహుమతికి ట్రంప్ పేరును ప్రతిపాదించినా, ఇరాన్‌పై బంకర్ బస్టర్ బాంబులతో ట్రంప్ దాడులు చేయించడంతో విపక్షాల ఒత్తిడి మేరకు ఆ ప్రతిపాదనను పాక్ వెనక్కు తీసుకోక తప్పలేదు. గతంలోనూ 2018, 2020, 2021లోనూ ట్రంప్ పేరును కొంతమంది నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదించారు. కానీ ఫలించలేదు. 'నాకు ఇప్పటికే నాలుగైదుసార్లు ఈ పురస్కారం రావాల్సింది. కానీ వాళ్లు నాకు ఇవ్వరు. కేవలం లిబరల్స్‌కు మాత్రమే ఇస్తారు'అని డెమొక్రటిక్ నేతలను ఉద్దేశిస్తూ ట్రంప్ ఇటీవల మీడియా ముందు అక్కసు వెళ్లగక్కడం తెలిసిందే. అధికారం లోకి రాగానే టారిఫ్‌ల వార్‌తో ప్రపంచ దేశాల వాణిజ్య సంబంధాలను ఛిన్నాభిన్నం చేసిన ట్రంప్ ఇప్పుడు రణదాహంతో పేట్రేగిపోతున్నా నోబెల్ శాంతి బహుమతిపై వ్యామోహం వీడకపోవడం విచిత్రమే.

సూర్య జాతీయ తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

# ప్రతి 26 సెకన్లకు ఓ ప్రకంపన..

## (విశ్లేషణ)

ప్రతి 26 సెకన్లకు భూమిలో ఓ రహస్య ప్రకంపన నమోదు

1960లలో తొలిసారిగా గుర్తించిన శాస్త్రవేత్తలు

పశ్చిమ ఆఫ్రికాలోని గినియా సింధుశాఖ దీనికి కేంద్రంగా అనుమానం

సముద్రపు అలలు లేదా అగ్నిపర్వతాల చర్యలే కారణమని భావన

"భూమి గుండెచప్పుడు"గా పిలుస్తున్న ఈ ప్రకంపనపై కొనసాగుతున్న పరిశోధనలు

ఇప్పటికీ వీడని మిస్టరీగా మిగిలిపోయిన భూమి స్పందన

మన భూమి అంతర్భాగంలో ఓ వింత ప్రకంపన శాస్త్రవేత్తలను దశాబ్దాలుగా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇది ఎంత బలహీనంగా ఉంటుందంటే, మానవులకు దీని ప్రభావం తెలియదు. కానీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత సున్నితమైన భూకంపాలను నమోదు చేసే సీస్మోమీటర్లు (భూకంపమాపకాలు) మాత్రం ప్రతి **26** సెకన్లకు ఒకసారి క్రమం తప్పకుండా ఈ సూక్ష్మ ప్రకంపనను రికార్డు చేస్తున్నాయి. శాస్త్రవేత్తలు దీన్ని సరదాగా "భూమి గుండెచప్పుడు" అని పిలుస్తున్నారు. ఈ వింత శబ్దాలను మొదటిసారిగా **1960**వ దశకంలో భూభౌతిక శాస్త్రవేత్త జాక్ ఆలివర్ గుర్తించారు. అప్పట్లో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో, ఈ ప్రకంపనలకు మూలం హిందూ మహాసముద్రంలోని అట్లాంటిక్ ప్రాంతంలో ఉందని ఆయన అంచనా వేశారు. కొన్ని ప్రత్యేక సమయాల్లో ఈ ప్రకంపనల తీవ్రత పెరుగుతుందని కూడా ఆయన కనుగొన్నారు. ఆ తర్వాత చాలా సంవత్సరాలకు, అంటే **2005**లో కొలరాడో విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకుడు మైక్ రిట్జ్‌వోలర్ నేతృత్వంలోని బృందం మరింత ఆధునిక పరికరాలను ఉపయోగించి ఈ ప్రకంపనలను ధ్రువీకరించింది. దీని మూలం పశ్చిమ ఆఫ్రికా తీరంలోని గినియా సింధుశాఖ ప్రాంతంలో, ప్రత్యేకించి బైట్ ఆఫ్ బోనీ వద్ద ఉందని వారు స్పష్టం చేశారు. "మేము ఏదో వింతైన, స్థిరమైన, నిరంతరమైన ప్రక్రియను గమనించాం" అని రిట్జ్‌వోలర్ ఆ సమయంలో తెలిపారు. సాధారణ భూకంపాల మాదిరిగా కాకుండా, ఇది చాలా క్రమబద్ధంగా ఉండటం శాస్త్రవేత్తలను అమితంగా ఆకర్షించింది. ఈ **26** సెకన్ల విరామంతో వచ్చే స్పందనకు కచ్చితమైన కారణం ఏమిటనేది ఇప్పటికీ పూర్తిస్థాయిలో తెలియరాలేదు. అయినప్పటికీ, శాస్త్రవేత్తలు కొన్ని ప్రధాన సిద్ధాంతాలను ప్రతిపాదించారు.

సముద్రపు అలల ప్రభావం:

బలమైన సముద్రపు అలలు తీరప్రాంతాలను లేదా సముద్ర గర్భాన్ని ఢీకొట్టినప్పుడు, అవి భూమి పొరలలో ఒత్తిడి తరంగాలను సృష్టిస్తాయని భావిస్తున్నారు. ఈ సూక్ష్మ ప్రకంపనలే ఈ **26** సెకన్ల లయకు కారణం కావచ్చునేది ప్రధాన పరికల్పన. గినియా సింధుశాఖలో సముద్రపు అలలు సముద్రగర్భంతో చర్య జరపడం వల్లే ఈ సంకేతం ఉత్పత్తి అవుతుండవచ్చని చాలామంది శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు.

అగ్నిపర్వతాల చర్యలు:

సముద్రగర్భంలోని అగ్నిపర్వతాల కార్యకలాపాలు లేదా భూమి యొక్క టెక్టోనిక్ ప్లేట్ల కదలికలు కూడా ఈ ఆవర్తన శక్తి విడుదలకు కారణం కావచ్చునేది మరో సిద్ధాంతం. **2013**లో చైనాకు చెందిన కొందరు పరిశోధకులు, గినియా సింధుశాఖలోని సావో టోమే అనే అగ్నిపర్వత ద్వీపం ఈ ప్రకంపనలకు కేంద్రంగా ఉండవచ్చని సూచించారు. ఈ "భూమి గుండెచప్పుడు" కేవలం శాస్త్రవేత్తల కుతూహలాన్ని రేకెత్తించే అంశం మాత్రమే కాదు. మన గ్రహం యొక్క సంక్లిష్టమైన అంతర్గత వ్యవస్థలను అర్థం చేసుకోవడానికి ఇది ఒక ముఖ్యమైన మార్గంగా ఉపయోగపడుతుంది. ఈ సూక్ష్మ ప్రకంపనలను అధ్యయనం చేయడం ద్వారా సముద్రాలు, టెక్టోనిక్ ప్లేట్లు, భూమి అంతర్భాగాలు ఎలా పరస్పరం చర్య జరుపుకుంటాయో శాస్త్రవేత్తలు మరింత లోతుగా తెలుసుకోవచ్చు. భవిష్యత్తులో భూకంపాలను గుర్తించడం, వాటిని అంచనా వేయడంలో కూడా ఇది కొంతవరకు సహాయపడగలదని ఆశిస్తున్నారు. అయితే, దశాబ్దాలుగా పరిశోధనలు సాగుతున్నప్పటికీ, ఈ **26** సెకన్ల విరామంతో వచ్చే స్పందన వెనుక ఉన్న అసలు కారణం ఇప్పటికీ ఒక రహస్యంగానే మిగిలిపోయింది. సాంకేతిక పరిజ్ఞానం మరింత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, భవిష్యత్ పరిశోధనలు ఈ నిగూఢమైన "భూమి గుండెచప్పుడు" వెనుక ఉన్న మిస్టరీని ఛేదిస్తాయని శాస్త్రవేత్తలు దృఢమైన ఆశాభావంతో ఉన్నారు.

## ప్రధాని మోదీ విదేశీ పర్యటన..

# 8 రోజులు, 5 దేశాల్లో పర్యటన!

జులై 2 నుంచి 9 వరకు ప్రధాని మోదీ 8 రోజుల విదేశీ పర్యటన

ఘనా, ట్రినిడాడ్, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాలను సందర్శించనున్న ప్రధాని

బ్రెజిల్‌లో జరగనున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్న మోదీ

గ్లోబల్ సౌత్ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే ప్రధాన లక్ష్యం

దశాబ్దాల తర్వాత ఘనా, ట్రినిడాడ్‌లో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం



ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. జులై 2వ తేదీ నుంచి ఎనిమిది రోజుల పాటు రెండు ఖండాల్లోని ఐదు దేశాల్లో ఆయన పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాలను సందర్శిస్తారు. బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడంతో పాటు, గ్లోబల్ సౌత్‌లోని కీలక దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్ఠం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది.

దశాబ్దాల తర్వాత కీలక దేశాల్లో పర్యటన

విదేశాంగ శాఖ ఆర్థిక సంబంధాల కార్యదర్శి దమ్ము రవి తెలిపిన వివరాల ప్రకారం, ప్రధాని మోదీ తన పర్యటనను జులై 2న ఆఫ్రికా దేశం ఘనాతో ప్రారంభిస్తారు. జులై 3 వరకు అక్కడే ఉంటారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఘనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఆర్థికం, ఇంధనం, రక్షణ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడంపై చర్చిస్తారు. అనంతరం జులై 3, 4 తేదీల్లో కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోలో పర్యటిస్తారు. 1999 తర్వాత ఈ దేశంలో భారత ప్రధాని పర్యటించడం కూడా ఇదే ప్రథమం.

అర్జెంటీనాతో వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు

అక్కడి నుంచి ప్రధాని నేరుగా దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాకు వెళ్తారు. జులై 4, 5 తేదీల్లో ఆ దేశంలో పర్యటిస్తారు. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలేతో మోదీ విస్తృతంగా చర్చిస్తారు. రక్షణ, వ్యవసాయం, మైనింగ్, చమురు, గ్యాస్, పునరుత్పాదక ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశాలపై ఇరువురు నేతలు దృష్టి సారిస్తారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

బ్రిక్స్ సదస్సులో కీలకోపన్యాసం

అర్జెంటీనా పర్యటన ముగిశాక, ప్రధాని మోదీ జులై 5 నుంచి 8వ తేదీ వరకు బ్రెజిల్‌లో పర్యటిస్తారు. రియో డి జనీరో వేదికగా జరగనున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ సదస్సులో ప్రపంచ పాలనా సంస్కరణలు, శాంతి భద్రతలు, కృత్రిమ మేధస్సు వినియోగం, వాతావరణ మార్పులు, ప్రపంచ ఆరోగ్యం, ఆర్థిక అంశాలపై ప్రధాని తన అభిప్రాయాలను పంచుకోనున్నారు. సదస్సు సందర్భంగా పలు దేశాధినేతలతో కూడా ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. చివరగా, జులై 9న నమీబియాకు చేరుకుని ఆ దేశంతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ప్రధాని నమీబియా పార్లమెంటులో ప్రసంగించే అవకాశం కూడా ఉందని సమాచారం.

# ఏడాదిలో విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం ప్రారంభమైంది: మంత్రి లోకేశ్

మోదీ, చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉందన్న మంత్రి

గడచిన పదేళ్లలో రాని పెట్టుబడులు ఏడాదిలో తీసుకువచ్చామని వ్యాఖ్య

దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నామన్న మంత్రి

బాబు సూపర్ సిక్స్ లో 'తల్లికి వందనం' హామీ నిలబెట్టుకున్నామని వెల్లడి

సంక్షేమం, అభివృద్ధి అనేది కూటమి ప్రభుత్వానికి జోడెద్దుల బండి అన్న లోకేశ్

ప్రజల ఆశలు నెరవేర్చే బాధ్యత తమపై ఉందని వ్యాఖ్య

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై మంత్రి నారా లోకేశ్ విలేకరుల సమావేశం



అమరావతి: సంక్షేమం, అభివృద్ధి అనేది కూటమి ప్రభుత్వానికి జోడెద్దుల బండి అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కూటమి పాలన ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ఉండవల్లి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ప్రజలు, ప్రజాస్వామ్యం గెలిచి ప్రజాపాలన ఏర్పడి ఏడాది పూర్తిచేసుకుంటున్నాం. సుపరిపాలనలో తొలి అడుగు పడింది. విధ్వంస పాలన నుంచి ఏకంగా వికాసం వైపు మన ప్రభుత్వం ప్రయాణం ప్రారంభించింది. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు గారి నాయకత్వంలో ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. ఉద్యోగాల విషయంలో మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు ప్రజా ప్రభుత్వం భర్తీ చేస్తోంది. డీఎస్సీని ఎట్టిపరిస్థితుల్లో ఆపాలని ప్రతిపక్ష పార్టీ సుమారు 24 కేసులు వేసింది. ఈ రోజుతో 24వ కేసు కూడా సుప్రీంకోర్టులో డిస్మిస్ అయింది. అవన్నీ తట్టుకుని డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేస్తున్నాం.

గడచిన పదేళ్లలో రాని పెట్టుబడులు ఏడాదిలో తీసుకువచ్చాం

గడచిన పదేళ్లలో రానిపెట్టుబడులు ఈ ఏడాది కాలంలో తీసుకురావడం జరిగింది. రూ. 9.5 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 8.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగింది. ఇవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. డొమెస్టిక్ ఇన్వెస్ట్ మెంట్స్ లో ఏపీ భారతదేశంలోనే నెంబర్ వన్ గా ఉంది. 16శాతం పెట్టుబడులు ఏపీకి వచ్చాయి. ఇందులో భాగంగా టీసీఎస్, ఎల్జీ, ఎన్టీపీసీ గ్రీన్, ఆర్సెల్లార్ మిట్టల్, బీపీసీఎల్, రిలయన్స్ రెన్యూ పవర్ లాంటి సంస్థలు ఈ రోజు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది కనుకనే విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడుకోగలిగాం. రైల్వేజోన్ సాధించాం. అలాగే భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి.

దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం

ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. వృద్ధులకు రూ.వెయ్యి పెంచి రూ.4వేలు అందిస్తున్నాం. వికలాంగులకు రూ.3వేలు పెంచి రూ.6వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైన వారికి ప్రతినెలా రూ.15వేలు అందిస్తున్నాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా 203 అన్నా క్యాంటీన్లు తిరిగి ప్రారంభించడం జరిగింది. ఆగష్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం కూడా అమలుచేస్తున్నాం. దీపం పథకం ద్వారా ఇప్పటికే 2 కోట్ల గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ప్రజా ప్రభుత్వం తెలుగింటి ఆడపడుచులకు అందించడం జరిగింది. గ్యాస్ పథకంలో సవరణలు తీసుకువచ్చి సదరు నగదును మహిళల బ్యాంక్ అకౌంట్లకే నేరుగా బదిలీ చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది.

బాబు సూపర్ సిక్స్ లో తల్లికి వందనం హామీ నిలబెట్టుకున్నాం

ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా తల్లికి వందనం హామీ నిలబెట్టుకుంటున్నాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అమలుచేస్తామని చెప్పాం. హామీ ఇచ్చిన విధంగా జీవో విడుదల చేయడం జరిగింది. ఈ రోజు నుంచి నగదు తల్లుల అకౌంట్లలో జమచేయడం జరుగుతుంది. రూ.13వేలు తల్లుల అకౌంట్లలో పడతాయి. రూ.2వేలు పాఠశాలల్లో మెయింటెన్స్ గ్రాంట్ కింద ఖర్చు చేయడం జరుగుతుంది. తల్లికి వందనం కింద దాదాపు 60శాతం కుటుంబాలు ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది పిల్లలు ఉన్నారు. వారికి ఇద్దరుంటే రూ.26వేలు, ముగ్గురుంటే రూ.39వేలు వస్తాయి. వారి అకౌంట్లలోనే నగదు జమచేయడం జరుగుతుంది. బాబు సూపర్ సిక్స్ లో మరొక హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవడం జరిగింది.

సంక్షేమం, అభివృద్ధి అనేది కూటమి ప్రభుత్వానికి జోడెద్దుల బండి

దేశంలో ఎవరూ చేయని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజాప్రభుత్వం చేపట్టడం జరిగింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలో సంక్షేమం, అభివృద్ధి అనేది ఈ ప్రభుత్వానికి జోడెద్దుల బండి. మాకు చాలా క్లియర్ మాండేట్ ఇచ్చారు. ఓ వైపు ఉద్యోగాలు, ఉపాధి, అభివృద్ధితో పాటు సంక్షేమం కూడా చేస్తూ.. ప్రజలు ఏ ఆశతో కూటమికి 94శాతం సీట్లు ఇచ్చి గెలిపించారో ఆ ఆశలు నెరవేర్చే బాధ్యత మాపై ఉంది" అని మంత్రి లోకేశ్ అన్నారు.

# ఈ లక్షణాలు విటమిన్ డి లోపానికి సంకేతాలు!

జుట్టు రాలడం, నడుం నొప్పి, నిరంతర అలసట, ఆందోళన, నిద్రలేమి

గాయాలు నెమ్మదిగా మానడం కూడా విటమిన్ డి తక్కువగా ఉందని సూచిస్తుంది

సూర్యరశ్మి, చేపలు, గుడ్డు సొన, పాలు, తృణధాన్యాలతో విటమిన్ డి పొందవచ్చు

ప్రధానమైన సంకేతాలివే..




శరీరానికి అత్యంత అవసరమైన పోషకాల్లో 'విటమిన్ డి' ఒకటి.. అయితే, ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురు పెద్దల్లో ఒకరు ఈ 'విటమిన్ డి' లోపంతో బాధపడుతున్నారట. ఈ పోషకం లోపిస్తే తీవ్రమైన అలసట, మానసిక కుంగుబాటు లక్షణాలు, ఎముకల సమస్యలతో ఇబ్బంది పడతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కొన్ని కీలకమైన సంకేతాలు, లక్షణాలను గమనించడం ద్వారా 'విటమిన్ డి' లోపాన్ని గుర్తించవచ్చని చెబుతున్నారు.

ప్రధానమైన సంకేతాలివే..

జుట్టు విపరీతంగా రాలడం అనేది ఒక ప్రధాన సంకేతం. 'విటమిన్ డి' లోపం వెంట్రుకల పెరుగుదల చక్రాన్ని దెబ్బతీసి, జుట్టు పెరుగుదలకు అవసరమైన కెరాటినోసైట్‌ల పనితీరును ప్రభావితం చేస్తుంది. అలాగే, నడుం నొప్పి కూడా ఒక ముఖ్య లక్షణం. 'విటమిన్ డి' లోపం వీపు, మెడ, నడుము కండరాల బలహీనతకు దారితీస్తుంది. ఈ బలహీనత కండరాలపై ఒత్తిడి పెంచి నొప్పికి కారణమవుతుంది.

ఆరోగ్యంగా ఉన్నా అలసట..

ఆరోగ్యంగా ఉన్నప్పటికీ నిరంతరం అలసటగా అనిపించడం కూడా 'విటమిన్ డి' లోపానికి సూచికే. శరీరంలోని కణాల జీవక్రియకు, శక్తి ఉత్పత్తికి 'విటమిన్ డి' అవసరం. ఇది తక్కువగా ఉన్నప్పుడు, ఎంత బాగా నిద్రపోయినా, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించినా నీరసంగా అనిపిస్తుంది. తక్కువ 'విటమిన్ డి' స్థాయిలు ఆందోళన లక్షణాలను కూడా పెంచుతాయి. మెదడు, నాడీ వ్యవస్థ ఆరోగ్యానికి 'విటమిన్ డి' చాలా ముఖ్యం. అంతేకాకుండా, ఆకలి మందగించడం, కుంగుబాటు, నిద్ర సరిగా పట్టకపోవడం, గాయాలు నెమ్మదిగా మానడం వంటివి కూడా 'విటమిన్ డి' లోపం వల్ల కలిగే ఇతర లక్షణాలు.

రక్త పరీక్ష ద్వారా..

ఈ లక్షణాలు మీలో కనిపిస్తే, వెంటనే వైద్యులను సంప్రదించి రక్త పరీక్ష ద్వారా 'విటమిన్ డి' స్థాయిలను తెలుసుకోవడం ఉత్తమం. లోపం ఉన్నట్లు తేలితే, వైద్యుల సూచన మేరకు చికిత్స తీసుకోవాలి. కొన్ని రకాల ఆహార పదార్థాల ద్వారా కూడా 'విటమిన్ డి'ని పొందవచ్చు. సాల్మన్, ట్యూనా వంటి కొవ్వు ఎక్కువగా ఉండే చేపలు, గుడ్డు సొన, పాలు, బాదం పాలు, సోయా పాలు, ఆరెంజ్ జ్యూస్, ఓట్ మీల్ వంటివి 'విటమిన్ డి'ని అందిస్తాయి. వీటితో పాటు, ప్రతిరోజూ కనీసం 10-15 నిమిషాలు ఉదయం సూర్యరశ్మిలో ఉండటం వల్ల శరీరం తనకు తానుగా 'విటమిన్ డి'ని ఉత్పత్తి చేసుకుంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

## బీసీల ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ.. సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం..!



**హైదరాబాద్, :** తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మరోమారు బీసీల గురించి చర్చను లేవనెత్తారు. తాజాగా మంత్రి బీసీల విషయమై స్పందిస్తూ.. బీజేపీ పార్టీ బీసీల వ్యతిరేకని మరోసారి నిరూపించుకుందని అన్నారు. ముగ్గురు బీసీ ఎంపీలు ఉన్నా.. అలాగే అనేకమంది బీసీ సీనియర్ నేతలు ఉన్నా సరే.., అలాగే బీజేపీ అధ్యక్షుడు కావడానికి అన్ని అర్హతలు ఉన్న ఇవ్వలేదని మండిపడ్డారు. గతంలో బీసీ ముఖ్యమంత్రి చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి కనీసం సభాపక్ష నాయకుడుని కూడా బీసీలకు ఇవ్వలేదని ఆగ్రహించారు. అంతే కాకుండా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఓ ఫ్యూడల్ పార్టీ. బీజేపీలో బీసీలకు ఎప్పుడూ న్యాయం జరగలేదు. బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఒక బీసీ నాయకుడు నామినేషన్ వెయ్యనివ్వకుండా అడ్డుకొని నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్నారన్నారు. బీజేపీలో బీసీలకు అన్యాయం జరుగుతుందని మీ పార్టీ నాయకులే వాపోతున్నారు.. దీనికి బీజేపీ అధిష్టానం ఏం సమాధానం చెప్తుందని ప్రశ్నించారు. ఇకపోతే, సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. బీసీల ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ.. ముఖ్యమంత్రి రెడ్డి ఉంటే, టీపీసీసీ అధ్యక్షుడిని బీసీని చేసుకున్నామన్నారు. మేము ఒకవైపు కుల గణన చేసుకొని బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చేస్తూ శాసన సభలో చట్టం చేసుకొని సామాజిక న్యాయం కోసం ముందుకుపోతుంటే.. బీజేపీ మరోసారి బీసీల గొంతు కోసిందని ఎద్దేవా చేశారు. దేశ వ్యాప్తంగా రాహుల్ గాంధీ బీసీల కోసం నినాదాన్ని ఎత్తుకున్నారన్నారు. తెలంగాణలో దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు న్యాయం జరిగేది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అంటూ తెలియచేశారు. గతంలో బీజేపీ అధ్యక్షుడు బీసీ నేత బండి సంజయ్ ఉంటే ఎన్నికల సమయంలో ఆయనను తొలగించి కిషన్ రెడ్డిని అధ్యక్షుడిని చేసారని గుర్తు చేశారు.

## కేసీఆర్ సూచనల మేరకే బీజేపీ అధ్యక్ష ఎంపిక.. ప్రభుత్వ విప్ సంచలన వ్యాఖ్యలు..!



**హైదరాబాద్, :** రాష్ట్ర రాజకీయాల్లో కొత్త వివాదానికి తెరలేపుతూ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అధ్యక్షుడి ఎంపికపై బీఆర్ఎస్, బీజేపీ మైత్రి మరోసారి బయటపడిందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకే బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపిక జరిగిందని ఆయన మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీజేపీకి "అవయవ దానం" చేసిందని వ్యాఖ్యానించారు. తాజాగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు లాంటి బలహీన వ్యక్తిని నియమించడం కూడా, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సాయం చేసే వ్యూహం భాగమని తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం కేసీఆర్ డైరెక్షన్‌లో జరిగిందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీ వర్గాలను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నాయని బీర్ల ఐలయ్య విమర్శించారు. గతంలో ఎన్నికల ముందు బండి సంజయ్ ను బీజేపీ అధ్యక్ష పదవి నుండి తప్పించడమూ, ఇప్పుడు మళ్లీ బీసీలకు కాకుండా అగ్రవర్ణాల నేతకు పదవి కట్టబెట్టడమూ దానికి ఉదాహరణలని అన్నారు. కేటీఆర్, హరీష్ రావు లు ఢిల్లీలో అర్ధరాత్రి బీజేపీ నేతలతో సమావేశాలు జరిపి అగ్రవర్ణాల నేతను అధ్యక్షుడిగా నియమించేలా లాబీ చేసినట్లు బీర్ల ఐలయ్య ఆరోపించారు. ఈ చర్యలన్నీ బీజేపీ-బీఆర్ఎస్ మధ్య ఒప్పందాన్ని బలపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఇక రాష్ట్ర బీజేపీ పార్టీలోని కీలక వ్యక్తి రాజసింగ్ కూడా బీజేపీకి రాజీనామా చేయడాన్ని బీర్ల ఐలయ్య ప్రస్తావించారు. ఇది బీజేపీ పార్టీ ఆత్మ స్థితిగతులపై ప్రజలకు సంకేతం ఇచ్చే విషయమని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రాణం పోసేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని పేర్కున్నారు.

## బీహార్ ఎన్నికల్లో పోటీపై కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ కీలక ప్రకటన



**న్యూఢిల్లీ,:** త్వరలోనే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాదిలోపు బీహార్ ఎన్నికలు ముగియనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఇక అన్ని పార్టీలు కదనరంగంలోకి దిగాయి. ఇదిలా ఉంటే రాష్ట్రంలో ప్రధానంగా యువత ఓట్లే కీలకం. దీంతో ఇప్పటికే యువ నేతలు తేజస్వి యాదవ్, కన్హయ్యకుమార్, ప్రశాంత్ కిషోర్ లాంటివాళ్లు పొలిటికల్ యుద్ధంలోకి దిగారు. తమ సత్తాను నిరూపించుకునేందుకు ప్రచారం నిర్వహిస్తున్నారు. తాజాగా లోక్ జనశక్తి పార్టీ నేత, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ కూడా బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతున్నారు. ఒక జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తాను కూడా పోటీ చేస్తున్నట్లు సంకేతాలు ఇచ్చారు. కచ్చితంగా పోటీ చేయాలనుకుంటున్నట్లు వెల్లడించారు. ఫైనల్‌గా పార్టీ నిర్ణయమే తుది నిర్ణయంగా చెప్పుకొచ్చారు. తనకైతే పోటీ చేయాలనే ఉందని.. చివరిగా పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలన్నారు. ప్రస్తుతం లోక్ జనశక్తి పార్టీ ఎన్డీఏ కూటమిలో ఉంది. మోడీ కేబినెట్‌లో చిరాగ్ పాశ్వాన్ మంత్రిగా ఉన్నారు. మరోసారి అధికారం కోసం నితీష్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రయత్నాలు చేస్తోంది. ఇంకోవైపు ఆర్జేడీ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి కూడా అధికారం కోసం ప్రయత్నిస్తోంది. మరోవైపు ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కూడా తమకు అధికారం కట్టబడితే.. నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని ప్రకటించారు. బీహార్ ప్రజలు ఈసారి ఏ పార్టీకి అధికారం కట్టబెడతారో మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.

## అధిష్ఠానం ఇంకా రాష్ట్ర అధ్యక్షుడిని ఇంకా ప్రకటించలేదు

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై కొనసాగుతున్న ఉత్కంఠ నేపథ్యంలో, కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టతనిచ్చారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయంపై అనవసర చర్చలు, విమర్శలు అర్థహీనమని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన, కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఒక కట్టర్ కేడర్‌తో కూడిన పార్టీ అని, రాష్ట్ర అధ్యక్ష పదవి విషయంలో అధిష్ఠానం అన్ని అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందన్నారు బండి సంజయ్. అధికారం కోసం కాదు, దేశం కోసం పనిచేసే పార్టీ బీజేపీ అని. ఎవరు అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలన్నది అడగొచ్చు కానీ, నిర్ణయం మాత్రం అధిష్ఠానమే తీసుకుంటుంది అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పార్టీకి వ్యతిరేకంగా పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీ తీర్పును గౌరవించకుండా, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడం సహించేది కాదు. అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం అని ఆయన పేర్కొన్నారు. ఇక, బీజేపీ బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వదని బిఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను బండి సంజయ్ ఖండించారు. "గతంలో నాకు, లక్ష్మణ్‌గారికి రాష్ట్ర అధ్యక్ష పదవిని ఇచ్చిన పార్టీ ఇదే బీజేపీ. బిఆర్ఎస్ వాళ్లు నిజంగా బీసీలకు న్యాయం చేయాలనుకుంటే, వారే బీసీలకు తమ పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు. "ఇక్కడ చంద్రబాబు నాయుడు ఎవరిని సూచించారన్నది సంబంధం లేదు. బీజేపీ ఏ నిర్ణయం తీసుకున్నా అది పార్టీ వ్యూహాల ప్రకారమే ఉంటుంది. ఎవరు డమ్మీలు కాదు.. ఎవరిని ఎక్కడ వినియోగించాలో పార్టీకి బాగా తెలుసు" అని స్పష్టం చేశారు.

# రైతు రాజయ్యేదెన్నడు?

రైతు లేనిదే రాజ్యం లేదు, అన్నదాతే దేశానికి వెన్నెముక. జై కిసాన్ అంటూ ఉపన్యాసాన్ని దంచికొట్టే పాలకుల తీరును చూస్తే 'మాటలు కోటలు దాటుతున్నాయి-చేతలే తంగేళ్లు దాటడం లేదు" అన్నట్టుగా ఉంది. నిజానికి రైతు శ్రమకు తగ్గ గుర్తింపు,గౌరవం ఇస్తు న్నామా?ఒక్కసారి పరిశీలిం చుకోవాల్సిన అవసరం ఉన్నది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంది. కారణం, పాలకుల చేతగానితనం, నిర్లక్ష్యపు వైఖరి. అదేస్థాయిలో పారిశ్రామిక, సాంకేతిక, సేవారంగాలు వేగంగా అభివృద్ధి చెందుతు న్నాయి.



ఎందుకు? ఇందులో పెట్టుబడి దారుల ప్రయోజనాలు కూడా ముడిపడి ఉన్నాయి. జాతీయ స్థూల విలువ జోడింపు (జీఏవి)లో వ్యవసాయం దాని అనుబంధ రంగాల వాటా బాగా తగ్గుతోంది. కృత్రిమ మేధ (ఏఐ)అన్ని రంగాల్లోనూ ప్రవేశించి ప్రగతి పరుగులు పెట్టిస్తుంటే వ్యవసాయ రంగం మాత్రం "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే"అన్న చందంగా కునారిల్లుతోంది. రైతు ఆత్మహత్యలను ఆపలేక పోవడం పాలకుల తీవ్రమైన వైఫల్యం. చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడు తున్న సాగును బాగుచేయడం పక్కనపెడితే, కనీసం ఆత్మ హత్యలనైనా నివారించాలి కదా! ప్రభుత్వం పెట్టిన పథకాలను నమ్ముకుని చాలామంది వ్యవసాయం వైపు మరిలారు. కానీ ఇక్కడ పెట్టుబడి రెండింత లైతే దిగుబడి అంతకన్నా తక్కువగా ఉంటున్నది. ఇలాంటి పరిస్థితులను అధిగమించేలా వెన్నంటే ఉండాల్సిన ప్రభుత్వం పత్తకు కూడా లేదన్నది వాస్తవం. దీనికితోడు వ్యవసాయంపై పర్యవేక్షణ కూడా రోజురోజూకూ కొరవడుతోంది. ఈ సంవత్సరం వర్షాలు జోరుగా కురుస్తాయని, రుతుపవనాలు ముందే వస్తాయని వాతావరణ శాఖ చెప్పింది.అలానే జూన్ మొదట్లో తొలకరి మురిపించింది.ఆ తర్వాత జూన్ నెలాఖరు వస్తున్నా



ఆకాశం మేఘావృతమై ఉంటుందే కానీ వర్షాలు పడటం లేదు.తొలకరి వానలకు నాటిన పత్తి తదితర పంటల కోసం రైతులు నొసటిన చేయి పెట్టి ఆకాశం వైపు ఎదురుచూస్తున్న పరిస్థితి ఇన్నేండ్లయినా మారలేదు. అన్నదాతలకు ఎంతో ముఖ్యమైన కాలమిది. తొలకరి వానలకు ముందుగా నాలుగుసార్లు దుక్కి దున్ని విత్తనాలు నాటుతాడు. మొక్క మొలకెత్తింది మొదలు దాన్ని పసి బిడ్డను చూసినట్లు అపురూపంగా చూసుకుంటాడు. కలుపుతీస్తాడు, మందులు వేస్తాడు. పంట చేతికందే సరికి అతివృష్టో లేదా అనావృష్టో ఆ పైరు ఎండిపోవడమో, కొట్టుక పోవడమో జరుగుతుంది. విత్తనాల ఖర్చులు కూడా తిరిగి రాని దయనీయ స్థితిలో రైతు ఉంటాడు. అలాంటి సమయంలో నిరాశ నిస్పృహకు లోనై, చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని మదనపడు తుంటాడు. ఈ సమయంలో ప్రభుత్వం గనుక ఆదుకుంటే ఏ సమస్య ఉండదు. రైతు కుటుంబం బాగుపడుతుంది. కానీ ప్రకృతి వైపరీత్యాలకు పాలకులు బాధ్యత వహించడం లేదు. ఏదైనా చేద్దామనుకున్నా కంటితుడుపు సాయం ప్రకటిస్తారు. రైతు పూర్తికాలం వ్యవసాయం రంగంలో బతకాలంటే ఇది ఏ మాత్రం సరిపోదు. వ్యవసాయం అంటే పండినా, పండక పోయినా రైతు నిరాశ చెందకుండా ముందుకు సాగే పరిస్థితి రావాలి. తరతరాలుగా చూస్తున్నా పాలకుల్లో వారిని బాగుపరిచే ఆలోచన రావడం లేదు. మన దేశంలో సాగు రంగంలో దండుగ! పండుగ రెండూ ఉంటాయి. ఈ రంగంలో ఒక యేడు పండితే? మరో యేడు పండదు.అయినా పండలేదని రైతు కాడి,మేడి వదిలేస్తే.. అందరికీ ఆహారం ఎలా?.ప్రకఅతి విపత్తులకు తోడు పాలకుల ఉదాసీనత, వ్యాపా(దళా)రుల దోపిడీ, నాసిరకం విత్తనాలు, నకిలీ పురుగుమందులు, నాణ్యతలేని ఎరువులు ఇలా అనేక విధాలుగా అష్ట కష్టాలైనా అనుభవిస్తూ, అధిగమిస్తూ పంట పండిస్తారు రైతులు. చివరకు పండిన పంట అమ్ముకునే నాటికి గిట్టుబాటు ఉండదు. అయినా వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతు ప్రకృతి మీద భారమేసి మళ్లీ సాగు మొదలుపెడతాడు. ఇందు లో అన్నదాతకు సహకరించేది అంతో ఇంతోఉందంటే అది ప్రకృతి తప్ప ప్రభుత్వం కాదు! అందుకే రైతుల పట్ల పాలకుల బాధ్యత పెరగాలి. దేశంలో సాగు రంగాన్ని తరతరా లుగా పట్టిపీడి స్తున్న ఆత్మహత్యల సామాజిక రుగ్మతను తరిమే యాలి. సాగులో నష్టాలు వచ్చినా, వారికి ఆర్థిక సహాయం అందించాలి. అన్న దాతల కుటుం బాల్ని కాపాడు కోవాలి.అప్పుడే రైతు రాజవుతాడు. అప్పటివరకు తన చేలో ఒక కూలీగానే ఉంటాడన్న సంగతి పాలకులు

# వికసిత భారత్ ఆవిష్కరణ ఎలా?



భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరిం చాలనేది అందరి సంకల్పం. అదే అంతిమ లక్ష్యం. 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో మన దేశం ఎన్నో విజయాలను సాధించింది. ఎన్నో మైలురాళ్లను నెలకొల్పింది. అదే సమయంలో నేటికీ మన దేశం అనేక రంగాల్లో వెనుకబడి ఉంది. ఎన్నో లోటుపాట్లున్నాయి. మనకంటే చిన్న దేశాల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. సమూల మార్పులతో కూడిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికతోనే దేశం పురోగమిస్తుంది. దేశ స్థూల జాతీయోత్పత్తి 4.18 ట్రిలియన్ డాలర్లకు చేరి.. మనదేశం జపాన్‌ను అధిగమించి ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే భారత్ కంటే ముందు ఉన్నాయి. అయితే ఈ దేశం ఈ ఘనత సాధించినప్పటికీ ఇంకా 24 కోట్ల మంది పేదరికంలోనే ఉన్నారు.. 11.8 శాతం మందికి పౌష్టికాహారం అందడం లేదు. 11.3 శాతం మందికి తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు అందు బాటులో లేవు. 13.9 శాతం జనాభాకు వంటగ్యాస్ అందు బాటులో లేదు. 13.6 శాతం మందికి ఇళ్లు లేవు. పేదలకు వైద్యసేవలు పెనుభారంగా మారాయి. ప్రజలు తమ 10 శాతం ఆదాయాన్ని వైద్యపరంగా వెచ్చించే దుస్థితి దేశంలో ఉంది. విద్య సైతం వ్యాపారంగా మారింది.

### నిరుద్యోగం ఓ పెనుభూతం

దేశానికి అతిపెద్ద సమస్యగా, దీర్ఘకాలిక ఆర్థిక సవాలుగా నిరుద్యోగం ఉంది. ఇది ఆదాయం, వృద్ధి, జీవన నాణ్యతను ప్రభావితం చేస్తోంది. పనిచేయడానికి సిద్ధంగా ఉన్నవారికి ఉద్యోగాలు లభించకపోవడం ప్రభుత్వాల వైఫల్యమే.. ప్రస్తుత నిరుద్యోగిత రేటు 4.9 శాతంగా ఉంది. 15 నుంచి 29 సంవత్సరాల యువతలో 17 శాతం మందికి ఎలాంటి ఉద్యోగాలు లేవు.. చైనా, జపాన్, మలేసియా, సింగపూర్ వంటి దేశాలు ఉపాధి కల్పనకు పెద్దపీట వేయడం వల్ల అక్కడ నిరుద్యోగం సమస్య కాలేదు.. చైనాలో బాలలకు ఆరో ఏట నుంచే ఉపాధి ఆధారిత విద్యాబోధన చేపట్టడం ద్వారా ప్రపంచదేశాలకు మార్గదర్శకంగా ఉంది. మన దేశంలో ఇప్పటికీ పాలకులు ఈ వైపుగా దృష్టి సారించడం లేదు.. డిగ్రీ తర్వాతే ఉద్యోగం అనే భావనే దేశంలో ఉంది. సింగపూర్, మలేసియా దేశాలకు ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు వరంగా మారాయి. 80 శాతం ఉపాధి వాటి ద్వారానే కలుగు తోంది. నైపుణ్యాభివృద్ధి ప్రతీ విద్యార్థి అవసరంగా గుర్తించే ప్రక్రియను ఇంకా మన దేశంలో చేపట్టనేలేదు.

### ఉద్యోగాల భర్తీ ఎలా సాధ్యమంటే..?

మన రాష్ట్రంలో, మన దేశంలో ప్రధాన సమస్య నిరుద్యోగం. ఈ ఆర్థిక సామాజిక సమస్యని పరిష్కరించాలంటే ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన కార్యక్రమాన్ని చేపట్టాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొదటి సంవత్సరంలో ప్రకటించిన రెండు లక్షల ఉద్యోగుల్లో ఇంతవరకు కేవలం పదకొండు వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చింది. ఇప్పటికీ ఇంకా రెండు లక్షల ఉద్యోగాలకు పైగా ఖాళీలు ఉన్నాయి.. అయిదేళ్లలో మొత్తం అయిదు లక్షల ఉద్యోగాల కల్పన చేయవచ్చు. రెండు లక్షల మంది ఉద్యోగులు పదవీ విరమణ అవుతారు.. ఈ ఖాళీలను గానీ పూరించగలిగితే, మిగిలిన ఒక లక్ష ఉద్యోగాలు కల్పించడం సమస్య కాదు. ప్రైవేటు రంగంలో పది లక్షల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ఇలా మొత్తం పదిహేను లక్షల ఉద్యోగ కల్పన చేయాలి. ప్రస్తుతం మన దేశంలో ప్రతి వెయ్యి మందిలో పదిహేను మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం జరుగుతుంది. దీన్ని ముప్పైకి పెంచితే నిరుద్యోగ సమస్య సులభంగా తీరుతుంది.

### మౌలిక వసతుల లోపం..

మౌలిక వసతుల లేమితో దేశ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 18 శాతం గ్రామాలకు ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు. ప్రజా రవాణా సౌలభ్యం 68 శాతం మందికే అందు బాటులో ఉంది. మిగిలిన ప్రాంతాల్లో ప్రజలు ఆసుపత్రులు, విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు.. సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్నా ఓడ రేవులు అక్కడక్కడే ఉన్నాయి. వైమానిక రంగంలోనూ వెనకబాటు కనిపిస్తోంది. అమెరికాలో 5170 విమానాశ్రయాలు ఉంటే మన దేశంలో 487 మాత్రమే ఉన్నాయి. దేశమంతటా తాతల కాలం నాటి రైల్వే లైన్లే ఇప్పటికీ ఉన్నాయి. కొత్త రైళ్ల నిర్మాణం అరుదుగా మారింది. స్టేషన్లను నవీకరిస్తూ మార్గాల విస్తరణను విస్మరిస్తున్నారు. దేశంలోని సహజ వనరుల వినియోగం అతి తక్కువగా ఉంది.

### వ్యవసాయ, అనుబంధ రంగాల్లో...

వ్యవసాయం దేశానికి జీవనాడిగా ఉన్నా అది పెను సవాళ్లు ఎదుర్కొంటోంది. ఆహార భద్రతను కల్పించే అన్నదాతలకు భరోసా లేదు. పెట్టుబడులకు అనుగుణంగా రాబడులు లేవు. రెట్టింపు ఆదాయం కల్పిస్తామని పాలకులు చెబుతున్నా కనీస ఆదాయం కలగానే ఉంది. మార్కెటింగ్ విధానం లోపభూయిష్టంగా మారింది. రైతుకు, వినియోగదారులకు మధ్య దళారీ వ్యవస్థ ప్రబలంగా పాతుకుపోయింది. పశుపోషణ, మత్స్య రంగం వంటివి ప్రగతికి దూరంగా ఉన్నాయి.

### ముందడుగు ఎలా?

2047 నాటికి అగ్రగామి దేశంగా అవతరించాలంటే సమూల మార్పులతో కూడిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికతోనే దేశం పురోగమిస్తుంది. దేశవ్యాప్తంగా ఉచిత విద్య, వైద్యం అందించాలి. చిన్ననాటి నుంచే శిక్షణ, నైపుణ్యాల అవపోసన ద్వారా మానవ వనరుల సత్వర వినియోగంతో నిరుద్యోగ నివారణకు ప్రభుత్వాలు నడుం బిగించాలి. దేశంలో ప్రతి ఇంటికీ తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలను కల్పించాలి. మౌలిక సదుపాయాలను ఏకీకృతం చేయడం, సామాజిక సంక్షేమ పథకాలను విస్తరించడం, ఆర్థిక వృద్ధిని నడిపించడం, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడం, సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించడం వంటివి లక్ష్యాలు కావాలి. ప్రస్తుత విధానాలు కొనసాగితే వికసిత భారత్ లక్ష్యాలు చేరడం అసాధ్యమే.

# బనకచర్ల పాపం..ఎవరిది?



నీళ్లు, నిధులు, నియామకాల కోసం.. కోట్లాడి ఎన్నో త్యాగాలు, వేలమంది యువకుల ప్రాణ త్యాగాలతో స్వరాష్ట్రంలో అవి తెచ్చుకుందామనుకుందాం. కానీ రాష్ట్రం ఏర్పాటయ్యాక సరిగ్గా పదేళ్లకే మళ్లీ అదే నీటి కోసం తెలంగాణ ప్రజల గుండె వెచ్చవుతోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం చేపట్టాలనుకుంటున్న బనకచర్ల ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రానికి గోదావరి మీద ఆధికృత గల్లంతవుతుంది. గోదావరిపై భవిష్యత్తులో ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా పోతుంది. ఇది కేవలం ఒక నీటి ప్రాజెక్టు కాదు, తెలంగాణ భవిష్యత్ సాగుకు చిరకాల గాయం. బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టులో భాగంగా ఉంది. ఇది కేవలం ఓ హెడ్ రెగ్యులేటర్ పేరు కాదు.. ఇది గోదావరి నీటిని దోచుకునేందుకు రూపొందించిన ఓ రాష్ట్ర వ్యూహం. ఆ ప్రభుత్వం గోదావరి జలాల్ని పోలవరం ప్రాజెక్టు ద్వారా బొల్లపల్లి రిజర్వాయర్‌కి తరలించి, అక్కడి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం ప్రాంతాలకు మళ్లించి అక్కడి కరువు సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

### పునాది వేసింది కేసీఆరే...

ఆంధ్రప్రదేశ్ రూ. 84,000 కోట్లతో చేపట్టబోయే బనకచర్లకు పునాది వేసింది కేసీఆర్, హరీశ్ రావేనని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు.. గోదావరి, కృష్ణా నదీ జలాలకు సంబంధించి 2016 ఫిబ్రవరి 21న ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నీటి పారుదల శాఖ మంత్రులు పాల్గొన్నారు. అయితే ఆ సమావేశం మినిట్స్‌కు సంబంధించి ఎనిమిది పేజీల్లోని ఆరో పేజీలో 'గోదావరి నుంచి ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయి. కృష్ణా బేసిన్ మీద నిర్మించాల్సిన ప్రాజెక్టులకు వెయ్యి టీఎంసీలు అవసరం.. గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు గోదావరి జలాలను తరలించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు' అని కేసీఆర్ ప్రతిపాదించిన విషయం బయటకు తెలిసింది. ఆ సమావేశంలో జరిగిన నిర్ణయం మేరకే ఇప్పుడు బనకచర్లను ఏపీ సీఎం చంద్రబాబు ముందుకు తెస్తున్నట్లు అర్థమవుతుంది. అంతేకాకుండా 2019లో జగన్మోహన్ రెడ్డి సీఎం అయ్యాకా.. 2019లో ఇద్దరు ముఖ్యమంత్రులు ప్రగతిభవన్‌లో సమా వేశమై ' రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు తాను పెద్దన్నగా సహకరిస్తాన'ని కేసీఆర్ హామీ ఇచ్చారు.

### మా ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వండి!

కేసీఆర్ చెప్పడం వల్లే చంద్రబాబు బనకచర్ల చేపట్టారని, కానీ, గోదావరి బేసిన్‌లో తెలంగాణకు 968 టీఎంసీలు, ఏపీకి 518 టీఎంసీల కేటాయింపులు మాత్రమే ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులు కట్టి వాడుకున్నాక మిగిలిన నీళ్లు కిందకు పోతే అవి వారు తీసుకుంటే ఎవ్వరికి అభ్యంతరం లేదు.. కానీ ఆ ప్రభుత్వం సమ్మక్కసాగర్, సీతరామ సాగర్‌తో పాటు గోదావరిలోని అన్ని ప్రాజెక్టులకు అభ్యంతరాలు చెబుతూ అనుమతులు రాకుండా చేస్తున్నది. అందుకే గోదావరిపై తెలంగాణ కట్టిన ప్రాజెక్టులకు 968 టీఎంసీలు వాడుకో వడానికి ముందుగా అనుమతులు ఇవ్వాలని కోరుతున్నారు. "రాష్ట్రానికి కేసీఆర్ చేసిన ద్రోహం వల్ల ఏపీకి నీళ్లు వరదలెక్క వస్తున్నయ్.. మేడిగడ్డ కూలిపోయింది. సుందిళ్ల అక్కరకు రాలే.. అన్నారం గురించి చెప్పాల్సిన పనేలేదు. అవే సక్కగుంటే ఆ నీళ్లు ఎత్తిపోసుకునేటోళ్లం. అప్పుడు ఏపీకి నీళ్లు వస్తుండెనో, రాకుండెనో తెలుస్తుండే" అని సీఎం అంటున్న మాటలు వాస్తవమే కదా! కృష్ణా జలాల్లో 555 టీఎంసీలు, గోదావరిలో 1000 టీఎంసీల నీటిని వాడుకునేందుకు తెలంగాణకు ఎన్ఓసీ ఇస్తే మీ ప్రాజెక్టులపై మా తెలంగాణకు ఎలాంటి అభ్యంతరం లేదు. అలా కానీ పక్షంలో "బనకచర్లను ఎలా అడ్డుకోవాలో మాకు తెలుస"ని ఏపీ సీఎంను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి అన్న మాటలను ఆషామాషీగా తీసుకోవద్దు. అందుకే ఈ విషయంలో రాష్ట్ర ప్రజలందరూ పార్టీలకు అతీతంగా రేవంత్ రెడ్డికి మద్దతుగా నిలబడాలి.

### ఉద్యమం తప్పదా?

బనకచర్ల ప్రాజెక్టు అనేది కేవలం నీటి అంశం కాదు. ఇది తెలంగాణ జీవన స్థితిగతులపై రాజకీయ దాడి. ఇది ఓ రాజకీయ వివాదం కాదు. ఇది జీవన ప్రశ్న, కాళేశ్వరం కడలి వేళ్లలోకి పోయినా, బనకచర్ల ద్వారా గోదావరి నీళ్లను తరలిస్తే తెలంగాణ పంటలు, జీవితాలు ఎండిపోతాయి. నీటి కోసం ఉద్యమించిన తెలంగాణ.. మళ్లీ నీటి కోసమే ఉద్యమించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. తెలంగాణ ఉద్యమంలో గోదావరి తీరంలో వేలమంది యువకులు, రైతులు "మా నీళ్లు మా వంటిల్లు దాటి పోకూడదు" అని ప్రాణాలిచ్చారు. ఇప్పుడు అదే గోదావరి నీటిని ఎత్తిపోసి, తెలంగాణ గుండెని ఎండబెట్టడాన్ని చూస్తూ ఊరుకుంటే.. అది మన అమరవీరుల త్యాగానికి విరుద్ధం. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే రేపటి తెలంగాణ ఎండిపోయిన ఎడారి భూమిగానే మిగిలిపోతుంది.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
WWW. Prabhata surya.com
మంగళవారం - 01 - జూలై - 2025

# మిల్కీ బ్యూటీ మెరుపులు తగ్గలేదు




మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపుగా రెండు దశాబ్దాలు అవుతోంది. ఈమె మొదటి తెలుగు సినిమా శ్రీ విడుదల అయ్యి 20 ఏళు కావస్తుంది. మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపుగా రెండు దశాబ్దాలు అవుతోంది. ఈమె మొదటి తెలుగు సినిమా శ్రీ విడుదల అయ్యి 20 ఏళ్లు కావస్తుంది. ఈమె వయసు సైతం అదే స్థాయిలో పెరుగుతూ వచ్చింది. అయినా కూడా అందం మాత్రం తగ్గడం లేదు. వయసుతో పాటు అందం తగ్గుతుంది అంటారు. కానీ మిల్కీ బ్యూటీకి అలా జరగలేదు. వయసు పెరిగినా కొద్ది మిల్కీ బ్యూటీ అందం పెరుగుతుందా ఏంటి అన్నట్లుగా ఈమె బ్యూటీ ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో తమన్నా అందాల ఆరబోత ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ ఉంటాయి. మరోసారి ఈ అమ్మడి అందాల ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇండస్ట్రీలో ఈమె జోరు తగ్గినప్పటికీ ఇన్‌స్టాగ్రామ్‌లో మాత్రం తగ్గడం లేదు. సౌత్ హీరోయిన్స్‌లో అతి కొద్ది మందికే సాధ్యం అయిన ఇన్‌స్టా ఫాలోవర్స్‌ను ఈమె సొంతం చేసుకుంది. దాదాపుగా 30 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఈమె ఒక పార్టీకి హాజరు అయింది. ఆ పార్టీకి సంబంధించిన ఫోటోలను షేర్ చేసింది. ఆ



ఫోటోల్లో ఈ అమ్మడి అందం ఏమాత్రం తగ్గలేదని, తమన్నా మెరుపులు ముందు ముందు మరింతగా ఉండబోతున్నాయి అన్నట్లుగా చెప్పకనే చెబుతున్నట్లు ఉన్నాయి అంటూ నెట్టింట కామెంట్స్ వస్తున్నాయి. ప్రస్తుతం ఈ అమ్మడి ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. క్లీవేజ్ షో తో ఈ అమ్మడు చేసిన సర్‌ప్రైజ్‌కి అంతా కూడా వావ్ అంటున్నారు. ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలు గతంలో చాలా చూశాం. అయితే తమన్నా ఇండస్ట్రీలో జోరు తగ్గడంతో అందం తగ్గిందని కొందరు చేస్తున్న విమర్శలకు ఈ ఫోటోలు సమాధానం అన్నట్లుగా ఉన్నాయని అభిమానులు కామెంట్ చేస్తున్నారు. క్లీ వేజ్ షో ఫోటోలతో తమన్నా చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఈ స్థాయిలో అందాల ఆరబోత కేవలం తమన్నాకే సాధ్యం. ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవుతున్నా ఇంతగా అందంగా కనిపించడం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. తమన్నా ముందు ముందు మరిన్ని పెద్ద సినిమాల్లో నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు. గత ఏడాదిలో తమన్నా నటించిన ఐదు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అందులో కొన్ని ఐటెం సాంగ్స్ చేసిన సినిమాలు కాగా, మరికొన్ని ముఖ్య పాత్రల్లో నటించిన సినిమాలు కావడం విశేషం. ఇక ఈ ఏడాదిలో ఇప్పటికే తమన్నా ఓదెల 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో శివసత్తు పాత్రలో నటించి అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. రైడ్ 2 సినిమాలోనూ తమన్నా కన్నుల విందు చేసింది. ప్రస్తుతం ఈమె చేతిలో మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. ముఖ్యంగా ఈమె హిందీలో ఎక్కువ సినిమాలు చేస్తుంది. తెలుగులో ఈమె ప్రస్తుతం చేస్తున్న సినిమాలు ఏమీ లేవు. వచ్చే ఏడాదిలో అయినా ఈమె తెలుగు సినిమాలు ఉంటాయేమో చూడాలి.




## ఛాన్సు లేకపోయినా శ్రీలీల అదే క్రేజ్!



'గుంటూరు కారం' తర్వాత శ్రీలీలకు హీరోయిన్ గా మరో హిట్ లేదు. అటుపై రిలీజ్ అయిన 'రాబిన్ హుడ్' తో వైఫల్యం తప్పలేదు. గుంటూరు కారం తర్వాత శ్రీలీలకు హీరోయిన్ గా మరో హిట్ లేదు. అటుపై రిలీజ్ అయిన రాబిన్ హుడ్ తో వైఫల్యం తప్పలేదు. పుష్ప-2 లో కిసిక్ పాటతో పాన్ ఇండియాలో ఫేమస్ అయింది. ఈ క్రేజ్ తోనే అమ్మడు టాలీవుడ్ లో ఇంకా అటెన్షన్ డ్రా చేస్తుంది. చేతిలో చెప్పుకోదగ్గ సినిమాలు లేకపోయినా క్రేజీ బ్యూటీ వైరల్ అవుతుందంటే కారణం కిసిక్ సాంగ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. మాస్ జాతర, ఉస్తాద్ భగంత్ సింగ్ చిత్రాల్లో నటిస్తోంది. ఈ రెండు మినహా కొత్త అవకాశాలు అమ్మడికి రాలేదు. వచ్చిన అవకాశాలను కాదనుకుంటుంది. అయితే అమ్మడు మనసంతా బాలీవుడ్ పై ఉంది. ఇప్ప టికే అక్కడ కొన్ని సినిమాలకు కమిట్ అయింది. ఆషికి-3 సహా మరో చిత్రంలో నటిస్తుంది. అలాగే తమిళ్ లోనూ కొన్ని కథలు విన్నట్లు ప్రచారం జరుగుతుంది. మరి సొంత భాషలో వచ్చిన అంటే సరైన కారణం మాత్రం బయటకు రాలేదు. డేట్లు సర్దుబాటు కాక వదులుకున్నట్లు ఓ వైపు ప్రచారం జరుగుతుంటే శ్రీలీల తల్లి బాలీ వుడ్ సినిమాలు చేయాల్సిందిగా ఒత్తిడి తెస్తుందనే వార్త వినిపిస్తుంది. తెలుగు కంటే ఇతర భాషలే ఉత్త మంగా మామ్ భావిస్తోందట. మరి ఈ ప్రచారంలో నిజమెంతో తెలియాలి. సాధారణంగా ఓ నటి సొంత భాషలో వస్తోన్న అవకాశాలు వదిలేసి ఇతర భాషలకు వెళ్తే నెగిటివిటీ స్ప్రెడ్ అవుతుంది. కానీ శ్రీలీల విషయంలో ఎలాంటి నెగిటిటీ తెరపైకి రాలేదు. ఆరకంగా శ్రీలీలకు పాజిటివ్ వైబ్ కనిపిస్తుంది. తెలుగులో అమ్మడికి మంచి ప్యాన్ బేస్ ఉన్న సంగతి తెలిసిందే.

## సమంత, అనుష్క ప్రయాణం ఒకేలా!



అనుష్క ఇమేజ్కి అవకాశాలు రాకపోవడం ఏంటి? అనుష్క సినిమాలు చేస్తాన నేలాగా నీ అడ్వాన్సులు ఇవ్వడానికి నిర్మాతలు క్యూ కడతారు. తర్వాత అనుష్క సినిమాల వేగం తగ్గిన సంగతి తెలిసిందే. నిశబ్దం,మిస్ పొలిశెట్టి మిస్టర్ పొలిశెట్టిలో నటించింది. ఆ రెండు ఆశించిన ఫలితాలు సాధించలేదు. ప్రస్తుతం ఘాటీలో నటిస్తోంది. మాలీవుడ్ లో కత్నార్ సినిమాతో ఎంట్రీ ఇస్తుంది. అనుష్క చేతిలో ఈ రెండు సినిమాలు మినిహా కొత్త ప్రాజెక్ట్ లు ఏవి లేవు. మరి అనుష్క అవకాశాలు రాక చేయలేదా? వచ్చినా వద్దనుకుంటుందా? అంటే అందులో రెండవదే ఖాయం చేసుకోవాలి. అనుష్క సినిమాలు చేస్తాన నేలాగా నీ అడ్వాన్సులు ఇవ్వడానికి నిర్మాతలు క్యూ కడతారు. అనుష్క కోసమే కథలు పట్టుకుని దర్శకులు సిద్దంగా ఉన్నారు. కానీ అనుష్కనే సిద్దంగా లేక బాగా నచ్చిన స్క్రిప్ట్ లు మినహా చేయడం లేదు. సరిగ్గా ఇదే పరిస్థితుల్లో సమంత కూడా కనిపిస్తుంది. ఖుషీ తర్వాత సమంత సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. అమెరికా నుంచి తిరిగొచ్చిన తర్వాత నిర్మాతగా మారింది. ఇప్పటికే శుభం అనే సినిమా కూడా రిలీజ్ చేసింది. అలాగే మా ఇంటి బంగారం అనే చిత్రం చేస్తుంది. అలాగే బాలీవుడ్ లో ఓ వెబ్ సిరీస్ చేస్తోంది. ఈ నేపథ్యంలో సమంత ఏ కారణంగా సినిమాలు చేయలేదు? అన్న చర్చ మొదలైంది. అవకాశాలు రాక చేయడం లేదా? వచ్చినా వద్దనుకుంటుందా? అన్న డిస్కషన్ మధ్య సమంతకు అవకాశాలు రాక పోవడం ఏంటి? కో అంటే కోటి మంది నిర్మాతలు ఆమెతో వచ్చి సినిమా చేయడానికి సిద్దంగా ఉన్నారన్నది మెజార్టీ వర్గం మాట. సమంత సీరియస్ గా దృష్టి పెడితే అవకాశాలు రాకుండా ఉంటాయా? అని అంటున్నారు. అనారోగ్య పరంగా తాను ఎదుర్కున్న పరిస్థితుల కారణంగానే సమంత సినిమాలపై దృష్టి పెట్టలేదు అన్న వాదనా తెరపైకి వస్తోంది.

# బీచ్‌లు సిస్టర్స్ ముద్దు రచ్చ రచ్చ

టాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌లో కాజల్ అగర్వాల్ ఒకరు అనడంలో సందేహం లేదు. సుదీర్ఘ కాలంగా కాజల్ అగర్వాల్ టాలీవుడ్‌లో కొనసాగుతోంది. టాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌లో కాజల్ అగర్వాల్ ఒకరు అనడంలో సందేహం లేదు. సుదీర్ఘ కాలంగా కాజల్ అగర్వాల్ టాలీవుడ్‌లో కొనసాగుతోంది. గత రెండు మూడు సంవత్సరాలుగా కాజల్ సినిమాలు తగ్గాయి, కానీ ఆమెకు ఉన్న క్రేజ్ మాత్రం తగ్గలేదు. పెళ్లి చేసుకుని, తల్లి అయిన తర్వాత కూడా ముందులా నటించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ టాలీవుడ్‌లో ఆమెకు మునుపటి మాదిరిగా సినిమా ఆఫర్లు రావడం లేదు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడికి ఉన్న గౌరవం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హీరోయిన్‌గా కాజల్ చేసిన ఎన్నో సినిమాలు సూపర్ డూపర్ హిట్‌గా నిలిచాయి. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా ఇతర భాషల్లోనూ నటించి మెప్పించిన ముద్దుగుమ్మ కాజల్ అగర్వాల్ అనే విషయం తెల్సిందే. ఇటీవల మంచు విష్ణు హీరోగా వచ్చిన 'కన్నప్ప' సినిమాలోనూ అత్యంత కీలకమైన పార్వతిదేవి పాత్రలో కాజల్ అగర్వాల్ నటించి మెప్పించింది. ఈ మధ్య కాలంలో లీడ్ రోల్స్ కాకుండా ఇలా గెస్ట్ అప్పియరెన్స్ ఇస్తూ వస్తున్న కాజల్ అగర్వాల్ ఛాన్స్ లభిస్తే లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో నటించేందుకు, యాక్షన్ సీన్స్ కు కూడా రెడీ అన్నట్లుగా చెప్పుకొచ్చింది. హీరోయిన్‌గా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న కాజల్ అగర్వాల్ ఇప్పటికీ అదే అందం, అదే ఫిజిక్‌తో చూపు తిప్పుకోనివ్వడం లేదు. తాజాగా మరోసారి కాజల్ అగర్వాల్ ఫోటోలు ఇన్‌స్టాలో వైరల్ అవుతున్నాయి. ఈసారి ఆమె సిస్టర్ నిషా అగర్వాల్‌తో ఉన్న ఫోటోలు కావడంతో పాటు బీచ్‌లో బికినీలో ఉండటంతో మరింతగా చూపు ఆకర్షిస్తున్నాయి. కాజల్ అగర్వాల్ పుట్టిన రోజు సందర్భంగా ట్రిప్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ ట్రిప్‌లో తీసుకున్న ఫోటోలను అప్పుడప్పుడు షేర్ చేస్తూ వస్తుంది. తాజాగా నిషా అగర్వాల్ షేర్ చేసిన ఫోటోలు వైరల్ అయ్యాయి. కాజల్ అగర్వాల్‌కి బీచ్‌లో కూర్చుని ముద్దు పెట్టడం అందరి




దృష్టిని ఆకర్షించింది. ఇద్దరు సిస్టర్స్ బీచ్‌లో బికినీలో ఉన్నారు. సాధారణంగానే ముద్దుగుమ్మలు బీచ్‌లో బికినీలో ఉంటే చూపు తిప్పడం కష్టం. అలాంటిది ఇద్దరు సిస్టర్స్ బికినీలో ఉండటంతో చూపు తిప్పలేక పోతున్నాం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కాజల్ అగర్వాల్ మాత్రమే కాకుండా నిషా అగర్వాల్ కూడా చాలా అందంగా ఉందని నెట్టింట కామెంట్స్ వినిపిస్తున్నాయి. సముద్రంలో వీరిద్దరూ సరదాగా తీసుకున్న ఈ ఫోటోలు నెట్టింట తెగ వైరల్ కావడంతో నిషా అగర్వాల్‌కి అదృష్టం కలిసి రాలేదు కానీ, స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశం దక్కి ఉంటే తప్పకుండా పెద్ద హీరోయిన్‌గా పేరు దక్కించుకుని ఉండేది అంటూ నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిషా అగర్వాల్ పలు సినిమాల్లో నటించినప్పటికీ లక్ కలిసి రాకపోవడంతో హిట్ పడలేదు. దాంతో అక్క కాజల్ కంటే ముందే పెళ్లి చేసుకుని వైవాహిక జీవితంలో స్థిర పడింది. ఇప్పుడు చెల్లితో పాటు అక్క కాజల్ అగర్వాల్ కూడా సంసార జీవితంలో స్థిర పడింది. వీరిని ఇలా చూసిన వారు చాలా మంది ఇద్దరు కలిసి ఏదైనా ఒక సినిమాలో నటిస్తే బాగుండేది అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్టీఆర్ సినిమా కోసం అమ్మడి డిమాండ్..!



సప్త సాగరాలు దాటి సినిమాతో సూపర్ పాపులర్ అయిన రుక్మిణి వసంత్ ఇప్పుడు టాలీవుడ్ లో ఫేవరెట్ హీరోయిన్ గా క్రేజ్ తెచ్చుకుంది. సప్త సాగరాలు దాటి సినిమాతో సూపర్ పాపులర్ అయిన రుక్మిణి వసంత్ ఇప్పుడు టాలీవుడ్ లో ఫేవరెట్ హీరోయిన్ గా క్రేజ్ తెచ్చుకుంది. మామూలుగానే కన్నడ నుంచి వచ్చిన భామలకు మంచి డిమాండ్ ఉంటుంది. సో సప్త సాగరాలు దాటి సినిమాతో తెలుగు ప్రేక్షకులను అలరించిన రుక్మిణి ఇక్కడ వరుస ఛాన్స్ లు అందుకుంటుంది. ఆల్రెడీ నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమా చేసిన రుక్మిణి ఆ సినిమాతో అంత ఇంపాక్ట్ చూపలేకపోయింది. ఆ సినిమా కూడా ఎప్పుడో తీశారన్నట్టుగానే వచ్చింది. ఇక ఇదిలా ఉంటే ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ కాంబో ప్రాజెక్ట్ లో రుక్మిణి వసంత్ హీరోయిన్ గా ఫిక్స్ అయ్యింది. ఈమధ్యనే అమ్మడు షూటింగ్ లో పాల్గొన్నదని తెలుస్తుంది. ఎన్టీఆర్ తో ఛాన్స్ అంటే రుక్మిణికి టాలీవుడ్ లో స్టార్ స్టేటస్ వచ్చినట్టే లెక్క. ఐతే ఈ సినిమాలో నటించేందుకు గాను అమ్మడు భారీగానే రెమ్యునరేషన్ అందుకుంటుందని తెలుస్తుంది. కన్నడ సినిమాల్లో హీరోయిన్స్ కి అంత ఎక్కువ పారితోషికం ఉండదు. అక్కడ స్టార్ హీరోయిన్స్ కే కోటి కన్నా ఎక్కువ ఇవ్వరు. రుక్మిణి వసంత్ అయితే ఇప్పటివరకు మేకర్స్ ఇచ్చిన పారితోషికం తీసుకోవడమే కానీ తను డిమాండ్ చేసింది లేదు. ఐతే ఎన్టీఆర్ సినిమాకు మాత్రం అమ్మడు కోటిన్నర దాకా రెమ్యునరేషన్ డిమాండ్ చేసిందని టాక్. తెలుగు హీరోయిన్స్ అది కూడా కాస్త ఫాం లో ఉన్న హీరోయిన్స్ కి



కోటిన్నర ఏంటి 2 కోట్ల నుంచి 3 కోట్లు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఐతే ఈమధ్య స్టార్ హీరోలంతా భారీగా రెమ్యూనరేషన్ పెంచారు కాబట్టి హీరోయిన్స్ కూడా అందుకు తగినట్టుగానే డిమాండ్ చేయాలని ఫిక్స్ అయ్యారు. కాస్త హిట్ ఫాంలో ఉన్న హీరోయిన్స్ ఐతే 5, 6 కోట్లు పారితోషికం తీసుకుంటున్నారు. ఎలాగు తీసేది పాన్ ఇండియా సినిమా కాబట్టు బడ్జెట్ 200, 300 కోట్లు పెడుతున్నప్పుడు హీరోయిన్స్ అడిగిన రెమ్యునరేషన్ ఇచ్చేందుకు నిర్మాతలు సైతం ఒకే అనేస్తున్నారు. రుక్మిణి వసంత్ మాత్రం తెలుగులో ఎన్టీఆర్ సినిమాతో సూపర్ క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తుంది. మరి ఈ సినిమా అమ్మడికి ఏ రేంజ్ క్రేజ్ తెస్తుందో చూడాలి. ఎన్టీఆర్ సినిమా చేస్తుంది కాబట్టి ఆ తర్వాత అమ్మడికి తెలుగులో వరుస స్టార్ ఛాన్స్ లు వస్తాయని చెప్పడంలో సందేహం లేదు.

# ఐటం పాట కోసం కరీనా కపూర్ ని ట్రై చేస్తున్నారా?





ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రాజాసాబ్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ నత్త నడకన సాగిన షూటింగ్ ఇప్పుడు పరుగులు పెడుతోంది. చక్కా చకా షూటింగ్ పూర్తిచేసే పనిలో పడ్డారు. జులై తొలి వారంలో కొత్త షెడ్యూల్ మొదలవుతుంది. అందులో ప్రభాస్ కూడా పాల్గొంటాడు. అది పూర్తయితే చిత్రీకరణ దాదాపు పూర్తయినట్లే. అటుపై పాటల చిత్రీకరణ మొద లవుతుంది. ఈ సినిమాలో ఓ స్పెషల్ ఐటం సాంగ్ కూడా ఉంది. ప్రభాస్ మాస్ ఇమేజ్ కు తగ్గట్టుగా ఆ పాటను డిజైన్ చేస్తున్నారు. తొలుత ఈ పాట కోసం థమన్ ఓ బాలీవుడ్ సినిమా గీతాన్ని రీమిక్స్ చేయాలని భావించాడు. కానీ తర్వాత ఆలోచన విరమించకుని ఓ ఫ్రెష్ సాంగ్ తోనే రావాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలోనే ఆ పాటలో ఐటం భాగమా లేడీ సూపర్ స్టార్ నయనతార అయితే బాగుంటుందనుకున్నారు. ఆమెను అప్రోచ్ అయినట్లు వార్తలొచ్చాయి. అయితే నయన్ ఆ పాటలో నటించడానికి అంగీకరించలేదని తేలింది. ఆ తర్వాత మళ్లీ ఐటం సాగ్ చర్చ రాలేదు. ప్రభాస్ ఫౌజీ షూటింగ్ లో బిజీగా ఉండం..రాజాసాబ్ హెల్డ్ లో పడటంతో ఎలాంటి చర్చ రాలేదు. తాజాగా షూట్ ప్రారంభమైన నేపథ్యంలో మళ్లీ ఐటం పాట లో హీరోయిన్ ఎవరు? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇండస్ట్రీలో మళ్లీ వాడి వేడి చర్చ జరుగుతుంది. ఈనేపథ్యంలో మారుతి ఏకంగా బాలీవుడ్ హీరోయిన్ కరీనా కపూర్ కోసమే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఓ ఏజెన్సీ ద్వారా ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. మరి ఈ ఆఫర్ విషయంలో కరీనా ఎలా స్పందిస్తుందో చూడాలి. కరీనా కపూర్ బాలీవుడ్ లో పెద్ద హీరోయిన్. తనకంటూ ఓ ఇమేజ్ ఉంది. లేడీ ఓరియేంటెడ్ చిత్రాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో కరీనా ఐటం పాటలకు ఒప్పు కుంటుందా? లేదా? అన్నది చూడాలి.

# క్యూటీ పూల్ సైడ్ స్పెషల్ ట్రీట్



క్యూట్ లుక్స్ తో కుర్రకారు హృదయాలను గెలుచుకున్న యంగ్ బ్యూటీ త్రిథా చౌదరి. హిందీ, బెంగాలీ, తెలుగు చిత్రాలలో నటిస్తున్న ఈ భామ ఆశ్రమ్ వెబ్ సిరీస్ లో వేడెక్కించే పెర్ఫామెన్స్ తో మతులు చెడగొట్టింది. త్రిథా ఈ సిరీస్ లో రెచ్చిపోయి బోల్డ్ సన్నివేశాల్లో నటించింది. ఇప్పటికే అరడజను పైగా వెబ్ సిరీస్ లలో నటించి తన ప్రతిభను నిరూపించింది. సినిమాల పరంగాను బోల్డ్ కంటెంట్ కి అభ్యంతరం చెప్పని భామగా గుర్తింపు పొందింది. మరోవైపు త్రిథా వరుస ఫోటోషూట్లు ఇన్ స్టాలో అగ్గి రాజేస్తున్నాయి. ఈ క్యూటీ గ్లామర్ ఎలివేషన్ కి ఎంతమాత్రం అభ్యంతరం చెప్పదు. తాజా ఫోటోషూట్ లో త్రిథా పూల్ సైడ్ అర్ధనగ్నంగా కనిపించింది. కొలనులో ఈదేందుకు సిద్ధమైన త్రిథా థై సొగసులను ఆవిష్కరిస్తూ కొంటెగా ఫోజులిచ్చింది. అయితే స్విమ్ చేయడానికి వెళుతూ ఇలాంటి ఫుల్ హ్యాండ్ డ్రెస్ తొడుక్కోవడం ఆశ్చర్యపరుస్తోంది. గాజు గ్లాసు, అందులో పానీయం, నిమ్మకాయ ఈ కాంబినేషన్ ఏమిటో కూడా అభిమానులకు అర్థం కావడం లేదు. త్రిథా ఒక్క మాట కూడా మాట్లాడకుండా కోటి భావనలు మదిలో మెదిలేలా అందమైన లుక్కుతో కట్టి పడేస్తోంది. అదే సమయంలో క్యూటీ .. హాటీ .. లవ్ లీ అంటూ యూత్ కోరస్ పాడుతూ త్రిథానే తథేకంగా వీక్షిస్తున్నారు. ప్రస్తుతం త్రిథా ఏ సినిమాలో నటిస్తోందో వెల్లడించలేదు. తదుపరి ప్రాజెక్టులపై అప్ డేట్ ఇస్తుందేమో చూడాలి.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh,epaper. www.prabhatha suryaa.com. Email. Prabhata surya @gmail.com.Rni TGTEL/25/A0784.